సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 20-10-2023 15/-

# భగ్గుమన్న పశ్చిమాసియా












సమాజ నవ భావాల పావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 42 హైదరాబాద్
శుక్రవారం 20 అక్టోబర్ 2023 రూ.15-00
4 రబీ ఉస్సాని 1445 హిజ్రీ

**తొలిగీటు**

**పీడితుని ఆర్తనాదానికి భయపడండి. ఎందుకంటే పీడితుడు తన హక్కుకై అల్లాహ్‌ను అర్థిస్తాడు. అల్లాహ్ హక్కు గల వారెవరికీ అతని హక్కు లభించకుండా చెయ్యడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



10

**కల నిజమవుతుంది**

# లోపల...

| | | |
|---|---|---|
| సమాజ నవ నిర్మాణం – యువతరం | ...... | 04 |
| భగ్గుమన్న పశ్చిమాసియా | ...... | 05 |
| చరితార్థులు-2 : వలీ షాహ్ | ...... | 09 |
| ఉరి తాడును ముద్దాడిన వీరుడు | ...... | 12 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి) | ...... | 14 |
| కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు-10 | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| గాఢాంధకారం | ...... | 20 |
| పత్రికా స్వేచ్ఛపై క్రూరమైన దాడి | ...... | 23 |
| రక్తానుబంధం రక్షానుబంధంగా మారాలంటే... | ...... | 24 |
| ఆత్మావలోకనం చేసుకోవాలి | ...... | 27 |
| చైనాలో ఇస్లాం వ్యాప్తి | ...... | 28 |
| మీ త్యాగాలకు సలామ్ | ...... | 30 |
| ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్ | ...... | 32 |

**చూద్దాం..!**
**ఏమవుతుందో..!!**




ఢీ అంటే ఢీఢీ అంటూ
ఒకరికొకరు సవాలు
తగ్గేదిక లేదు అంటూ
వేస్తున్నరోయి శివాలు!
హ్యాట్రిక్ కొడతామని
అంటున్నది బీఆరెస్
అధికారం తమదేనని
అంటున్నది కాంగిరేస్ !!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# సమాజ నవనిర్మాణం-యువతరం

**ఏ సమాజంలోనయినా,** ఏ కాలంలోనయినా సంస్కరణను, సముద్ధరణను, పరివర్తనను కాంక్షించేది, ఆచరణాత్మకంగా ఆ బాటలో నడిచేది, ఆ ధ్యేయాన్ని సాధించగలిగేది– ఒక్కమాటలో చెప్పాలంటే ఎలాంటి విప్లవమయినా తెచ్చేది– యువతరమే. ఇందులో మరో అభిప్రాయానికి తావులేదు. యువకులు ఓ కార్యానికి పూనుకుంటే దాన్ని సాధించేవరకు నిద్దురపోరు. అది వారికి సహజం.

ప్రపంచ చరిత్ర తిరగవేస్తే ఏ ఉద్యమమయినా విజయవంతంగా నడవడానికి, అది ముందుకు సాగడానికి యువకులే కారణ మయ్యారని తెలుస్తుంది. చివరికి దైవప్రవక్తలు ధర్మోద్యమాలను నడిపినప్పుడు సయితం వారికి తోడ్పడింది, దైవమార్గంలో స్థిరంగా నిలిచింది ఆనాటి యువతరం వారే. దివ్యకుర్ఆన్ అధ్యయనం వల్ల దైవప్రవక్తలయిన నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా (అలైహిముస్సలామ్) ప్రభృతులతోపాటు దైవ సందేశ ప్రచారంలో పాల్గొన్నవారు యువకులే అని ద్యోతకమవుతుంది.

మహాప్రవక్త ముహమ్మద్(స) జీవిత చరిత్రను అధ్యయనం చేస్తే 1400 ఏళ్ళకు పూర్వం ఇస్లామీయ ఉద్యమాన్ని నడిపి దాన్ని దిగ్విజయం గావించడానికి కారకులు యువకులే అని బోధపడుతుంది.

వాస్తవమేమంటే వయసు మళ్ళినవారు పాత సంప్రదాయాలను ఇట్టే వదల లేరు. వారు ఓ విధమయిన జీవన విధానానికి అలవడి ఉంటారు. దాన్ని వదలి కొత్త బాటను తొక్కడమంటే వాళ్ళ వల్ల కాని పని. అందువల్ల సాధారణంగా వృద్ధులు కొత్త ఉద్యమాలను త్వరగా స్వీకరించరు. దీనికి భిన్నంగా యువకులు కొత్త దాన్ని తెలుసుకోవాలని, కొత్త పంథాను అవలంబించాలని, పాత దాన్ని ఓ విధంగా దెబ్బతీయాలని సహజంగానే ఉబలాట పడుతుంటారు. అయితే యువకులకు మార్గం చూపెట్టినవారు, చూపెట్టవలసినవారు నిత్యం అనుభవజ్ఞులయిన పెద్దవారే. ఈ పరిస్థితుల్లో యువకులకు సహేతుకమయిన, నిర్మాణాత్మక మయిన, సత్ఫలితాలనిచ్చే ఓ ఉద్యమం పరిచయ మయితే వారు దాన్ని మానవాళి మేలు కొరకు విజయవంతంగా నడిపి ఓ విధంగా మానవ సేవ చేసినవారవుతారు. లేకపోతే ఒకవేళ వారు విచ్ఛిన్నకరమయిన, దుష్పరిణామాలు కలిగించే ఉద్యమా లకు గురయితే సంఘానికి కీడును తెచ్చిపెట్టిన వారవుతారు. అందువల్ల యువతరం ఎటు పయనిస్తోంది? దాని వైఖరి ఏ విధంగా పరిణమిస్తుంది? అని గమనించవలసిన కర్తవ్యం పెద్దలదే. యువత పెడత్రోవ తొక్కకుండా కాపాడి వారిని సత్క్రమ మయిన మార్గాన నడిపించవలసిన బాధ్యత కూడా ఈ పెద్దలదే.

అయితే ఈ సందర్భంలో గమనించవలసిన మరో ముఖ్య విషయమేమంటే, సమాజంలో యువశక్తి అచేతనమయి, ఏ నిర్మాణాత్మకమయిన కార్యంలోనూ ఆసక్తి కనబరచకుండా, నిర్లిప్తత, ఉదాసీనత అలవరచుకుంటే ఇక ఆ సమాజం తన చరమ దశకు చేరువయిందని అర్థం చేసుకోవలసిందే. ఆ సమాజం ఇతరులకు మార్గదర్శకం, ఆదర్శప్రాయమవడం అలా ఉంచి స్వయంగా దాని మనుగడకు ముప్పు మూడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నమాట.

నేడు మన యువతరం దాదాపు ఇలాంటి పరిస్థితిలోనే పడబో తోంది. భోగలాలసత్వం, క్షణిక ప్రయోజనాలపై మక్కువ, క్రియా శూన్యత లాంటి రుగ్మతలు ఓ వైపు మన యువతను పట్టి పీడిస్తుంటే మరోవైపు విధ్వంసకర ప్రవృత్తుల్ని రెచ్చగొట్టే, హింసా దౌర్జన్యాలను ప్రబోధించే సాహిత్యం ఉద్యమాలు మన యువకుల్ని ఆకట్టుకుంటున్నాయి. నిర్మాణాత్మక ధోరణులు, సంస్కరణాత్మక ప్రయత్నాలు యువకుల్లో నానాటికీ క్షీణిస్తు న్నాయి.

చౌకబారు నవలా సాహిత్యం, బూతు సినిమాలు, మద్యం, గంజాయి, ఎల్ఎస్డి లాంటి దుర్వ్యసనాలు ఈనాడు యూని వర్సిటీలతో సహా యువకులుండే ప్రతిచోటా సర్వసామాన్యమయి పోయాయి.

పరిస్థితుల ఈ స్వరూపం మారాలంటే– మళ్ళీ యువకులే కంకణ బద్ధులయి నిలువవలసి ఉంటుందని చెప్పక తప్పదు. పెద్దల మార్గ దర్శకత్వంలో, వారి ఆశీర్వాదంతో ముందుకుసాగవల సింది యువతరమే. యువతరం కదిలితేనే సమాజం కదిలేది! ✤

అబ్దుల్ వాహెద్



# భగ్గుమన్న పశ్చిమాసియా

**మానవప్రాణం** అత్యంత విలువైనది. మనిషి ప్రాణాలు తీసే యుద్ధం అత్యంత అమానుషమైనది. హమాస్ దాడిలో, ఆ తర్వాత ఇస్రాయీల్ దాడిలో చనిపోతోంది అమాయక ప్రజలే. ఇది అత్యంత దుర్భరమైన వాస్తవం.

అక్టోబర్ 7వ తేదీన పాలస్తీనా మిలిటెంటు సంస్థ హమస్ ఇస్రాయీల్‌పై బహుముఖ దాడి చేసింది. హమస్, ఇస్రాయీల్ మధ్య 2021లో పదకొండు రోజుల యుద్ధం జరిగింది. ఆ తర్వాత ఆ స్థాయిలో తీవ్రమైన దాడిగా ఇది పరిగణించబడుతోంది. హమస్ ఈ దాడికి ఆపరేషన్ అల్ అక్సా ఫ్లడ్ అని పేరుపెట్టింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఆరున్నరకు ఈ దాడి ప్రారంభమైంది. హమస్ వాయుదాడులు, సముద్రదాడులు, భూదాడులు ముప్పేటలా ఈ దాడి కొనసాగించింది. దాదాపు 5 వేల రాకెట్లను హమస్ ఇస్రాయీల్‌పై ప్రయోగించినట్లు ప్రకటించింది. గాజాలో హమస్ బలంగా ఉంది. గాజా నుంచి సుదూరాన ఉన్న టెల్ అవీవ్ వరకు రాకెట్లతో దెబ్బతీసినట్లు తెలుస్తోంది. ఇస్రాయీల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారి ఈ దాడిని ధ్రువీకరించాడు. హమాస్ ముప్పేట దాడి చేసిందని చెప్పాడు. భూమార్గాన, సముద్రమార్గాన, గగనతలం నుంచి దాడులు చేశారని, ఇస్రాయీల్ లోకి చొచ్చుకువచ్చారని అన్నాడు. యూదుల సెలవుదినం సించాట్ తోరా రోజున ఈ దాడి జరిగింది. దీనికి ప్రతీకారంగా ఇస్రాయీల్ హమాస్ పై ప్రతిదాడులు ప్రారంభించింది. ఆపరేషన్ ఐరన్ స్వార్డ్స్ పేరుతో ఈ ఆపరేషను ప్రారంభించింది. గాజాపై భారీగా బాంబుల వర్షం కురిపించింది. కఫార్ అజా, దెరాట్, సుఫా, నహల్ ఓజ్, మాజెన్, బేఈరీ, రీమ్ మిలటరీ బేస్ తదితర ప్రాంతాల్లో కాల్పులు కొనసాగుతున్నాయని, పోరాటాలు కొనసాగుతున్నాయని ఇస్రాయీల్ సైన్యం తెలియజేసింది. హమస్ ప్రతినిధి ఖదోమీ మాట్లాడుతూ దశాబ్దాలుగా పాలస్తీనాపై జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడిని అభివర్ణించాడు. గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇస్రాయీల్ దుర్మార్గాలను అంతర్జాతీయ సమాజం అడ్డుకోవాలని, అల్ అక్సా వంటి తమ పవిత్ర ప్రదేశాలపై దాడులను అడ్డుకోవాలని హమస్ ప్రతినిధి చెప్పారు. హమస్ మిలిటరీ కమాండర్ ముహమ్మద్ డాయిఫ్

మాట్లాడుతూ భూమిపై చివరి దురాక్రమణను తొలగించే గొప్ప పోరాటదినంగా ఈ రోజును వర్ణించాడు. ఇస్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు మాట్లాడుతూ ఇస్రాయిల్ యుద్ధాన్ని ఎదుర్కొంటుందని, ఈ యుద్ధంలో ఇస్రాయిల్ గెలిచి తీరుతుంద న్నాడు. ఇస్రాయిల్ రక్షణ మంత్రి యువావ్ గాలంట్ కూడా ఇదే మాట చెప్పాడు. ఈ దాడుల తర్వాత ఇస్రాయిల్ కేబినెటు అత్యవసర సమావేశం నిర్వహించింది. అంతర్జాతీయ సమాజం ఈ దాడులను వెంటనే ఖండించింది. యూరోపియన్ యూని యన్, బ్రిటన్ తదితర దేశాలు హమస్ దాడులను ఖండించాయి. ఈరాన్ పాలస్తీనా పోరాటయోధులకు తన మద్దతు ప్రకటిం చింది. ఇస్రాయిల్‌పై హమస్ చేసిన దాడి, ఇస్రాయిల్ ప్రతి దాడులు అదుపుతప్పి పూర్తి స్థాయి యుద్ధంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో మరింత అస్థిరతకు ఇది దారితీయవచ్చు.

హమస్ దళాలు ఇస్రాయిల్‌లోనికి చొచ్చుకువచ్చినట్లు తెలు స్తోంది. ఇస్రాయిల్‌లోని కొన్ని ప్రాంతాలను హమస్ తన అదుపులో తీసుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఇస్రాయిల్ సైన్యం హమస్ ను వెనక్కు నెట్టడానికి పోరాడుతోంది. హమాస్ దాడి ఇస్రాయిల్‌ను దిగ్భ్రాంతికి గురిచేసిందని విశ్లేషకులు అంటు న్నారు. గాజా సరిహద్దు నుంచి దాదాపు 24 కిలోమీటర్ల వరకు హమస్ దళాలు ఇస్రాయిల్‌లోనికి చొచ్చుకువచ్చినట్లు వార్తలు వచ్చాయి. అనేకచోట్ల హమస్ ఇస్రాయిల్ సైనికులను, సాధారణ పౌరులను కూడా నిర్బంధంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్బంధంలోకి తీసుకున్న ఇస్రాయిల్ మహిళల పట్ల హమస్ మిలిటెంట్లు చాలా అమానుషంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలే నిజమైతే ప్రతిఘటన ఉద్యమంగా హమాస్ పంపాదించుకున్న సానుభూతిపరులను కూడా కోల్పోవచ్చు. చాలా వీడియోలు ఫేక్ వార్తలవి కూడా వస్తున్నట్లు కొందరు చెబుతున్నారు. ఏది ఏమైనా యుద్ధం అనేది అమానుష మైనది.

ఈ దాడిని పరిశీలిస్తే 1973లో ఈజిప్టు, సిరియా దళాలు చేసిన దాడి మాదిరిగా ఉందని కొందరు వర్ణిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఇస్రాయిల్ సెట్లర్లు అల్ అక్సా వద్ద ఆయుధాలతో చొరబడి బీభత్సం సృష్టించారు. గత కొంతకాలంగా గాజాలో ఇస్రాయిల్ దౌర్జన్యాల వార్తలు వస్తూనే ఉన్నాయి. రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వదేవ్ మాట్లాడుతూ ఈ దాడి ఊహిం చిందే అన్నాడు. మధ్యప్రాచ్యంలోను, ఉక్రెయిన్‌లోనూ అమెరికా జోక్యం వల్ల ఇలాంటి పరిణామాలు తప్పవని అన్నాడు.

నిజానికి ఈ దాడి ఆశ్చర్యకరమైనదేమీ కాదు. రష్యా మాజి అధ్యక్షుడు చెప్పినట్లు ఇది ఎప్పుడో ఒకప్పుడు జరగక తప్పదనే పరిస్థితులే కనిపిస్తూ వచ్చాయి. గత కొన్ని సంవత్సరాలుగా, ముఖ్యంగా గత ఏడు నెలలుగా ఇస్రాయిల్ దౌర్జన్యాలు శృతి మించాయి. వేలాది మంది సైనికులను వెస్ట్ బ్యాంకులో పంపించి ఇస్రాయిల్ పాలస్తీనీయులపై కొనసాగించిన హత్యాకాండలు ప్రపంచానికి తెలియనివి ఏమీ కావు. పసి పిల్లలు కూడా అనేకమంది ఈ దాడుల్లో మరణించిన వార్తలు వచ్చాయి. వెస్ట్ బ్యాంకులో ఇస్రాయిల్ ఇంచార్జి మంత్రి బిజాలీ స్మోట్రిచ్ అక్కడి పాలస్తీనా గ్రామం హువారాను పూర్తిగా ధ్వంసం చేయించాడు. అక్కడి సెటిలర్లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందంటే, కొన్ని వార్తల ప్రకారం, పాలస్తీనా కుటుంబం తమ ఇంట్లో వండుకుని తినబోతున్న సమయంలో ఎవడో ఒక సెట్లర్ వస్తాడు. ఇల్లు ఖాళీ చేయమంటాడు. పాలస్తీనా కుటుంబం ఆ ఇల్లు ఖాళీ చేసి, తమ స్వంత ఇంటిని ఖాళీ చేసి శరణార్థులుగా వెళ్ళిపోక తప్పని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో బతుకు తున్న పాలస్తీనీయులు ఈ దాడి తర్వాత కోల్పోయేదేముంటుంది. హమాస్ దాడి తర్వాత గాజాను సర్వనాశనం చేస్తామని ఇస్రా యిల్ ప్రధాని ప్రకటించాడు. కాని పాలస్తీనీయులు ఇంకా నాశనం కావలసిందేముంది. వారు కోల్పోయేదేముంది. వారు సర్వనాశనం ఎప్పుడో అయిపోయారు.

అణిచివేయబడిన వారు శాశ్వతంగా అణిచివేతను భరిస్తూ ఉండరు. స్వేచ్ఛ కోసం ఆకాంక్ష చివరకు ఏదో ఒక రూపంలో బట్టబయలు అవుతుందన్నాడు మార్టిన్ లూథర్ కింగ్. గత అర్థ శతాబ్దానికి పైగా పాలస్తీనియన్లు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. గాజా నిజానికి ఒక బహిరంగ జైలు వంటిదిగా మారిపోయింది. ఇస్రాయిల్ ఏర్పడడమే దురాక్రమణ రాజ్యంగా ఏర్పడింది. 1948 మే 15వ తేదీన పాలస్తీనా అరబ్బు ప్రజల్లో 70శాతం మంది తమ ఇల్లువాకిలి వదిలేసి ఇస్రాయిల్ ఏర్పాటు కోసం శరణార్థులుగా మారిపోయిన సంఘటన చరిత్రలో మాయని మచ్చ వంటిది. ఇప్పుడు 80 లక్షల మంది పాలస్తీనా శరణార్థులు ఉన్నారు. ఆ తర్వాత 1948 యుద్ధంలోనే ఇస్రాయిల్ 77 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుంది. 1967 యుద్ధం తర్వాత మరిన్ని భూభాగాలను ఇస్రాయిల్ ఆక్రమించు కుంది. 1973 యుద్ధం ఐక్యరాజ్యసమితి జోక్యంతో ఆగింది. ఆ యుద్ధం తర్వాత పాలస్తీనీయుల హక్కులను ఐక్యరాజ్యసమితి గుర్తించింది. కాని ఇస్రాయిల్ భూ దురాక్రమణ కొనసాగుతూనే వచ్చింది. హమాస్ తర్వాత ఏర్పడిన సాయుధ సంస్థ. హమాస్ బలం ఎక్కువగా గాజాలోనే ఉంది. 2012లో గాజాలో ఇస్రా యిల్ బీభత్సం సృష్టించింది. హమాస్ ఇస్రాయిల్ ఉనికినే గుర్తించడానికి నిరాకరిస్తోంది. 2023 మొదటి ఐదు నెలల కాలంలో

ఇస్రాయిల్ పాల్పడిన  దౌర్జన్యాల వార్తలు తరచు ప్రపంచం చదువుతూనే వస్తోంది.  ఈ నేపథ్యంలో ఈ దాడిని అర్థం చేసుకోవాలి.

హమాస్ దాడి చాలా పెద్ద స్థాయిలో జరిగింది.  వేలాది మంది పోరాటయోధులు పాల్గొన్నారు. బుల్డోజర్లు,  హ్యాండ్ గ్రెనెడ్లు రకరకాల ఆయుధాలు, వాహనాలు ఉపయోగించారు. ఈ స్థాయి దాడి చేయాలంటే పథకరచనకు, ఏర్పాట్లకు చాలా సమయమే పట్టి ఉండాలి. ప్రపంచంలో అత్యంత సమర్థవంతమైన గూఢచారవ్యవస్థగా చెప్పుకునే ఇస్రాయిల్ గూఢచార సంస్థ, తన పక్కనే జరుగుతున్న ఈ ఏర్పాట్లను పసిగట్టలేకపోయింది. ఇస్రాయిల్ గగనతలంలో ప్రవేశించే ప్రతి క్షిపణిని కూల్చివేసే ఐరన్ డోమ్ గొప్పలు ఇప్పుడు ఇస్రాయిల్ చెప్పుకోవడం సాధ్యం కాదు.

హమాస్ చాలా ఖచ్చితమైన లెక్కలతో ఈ దాడి చేసిందని నిపుణులు చెబుతున్నారు. ఇస్రాయిల్ గగనతలాన్ని కాపాడే ఐరన్ డోమ్ సామర్థ్యం 90 శాతం మాత్రమే అన్నది గతంలో చేసిన దాడుల్లో హమాస్ కనిపెట్టింది. వంద క్షిపణులు ప్రయోగిస్తే కనీసం పది క్షిపణులు లక్ష్యాన్ని చేధిస్తాయి. అదే 5000 క్షిపణులు ప్రయోగిస్తే, విధ్వంసం జరుగుతుంది.  హమాస్  ఈ లెక్కలే వేసుకుంది. పైగా హమాస్ తయారు చేసుకునే క్షిపణులకు అయ్యే ఖర్చు మూడు వందల డాలర్లకు మించదని అంటున్నారు. కాని ఈ క్షిపణిని కూల్చడానికి ఇస్రాయిల్ ప్రయోగించే ఐరన్ డోమ్ క్షిపణి ఖర్చు ఎనభై వేల డాలర్లు. ఈ  దాడి ఆర్థికంగా కూడా ఇస్రాయిల్ పై పెనుభారంగా మారబోతోంది. ప్రపంచంలో తిరుగులేని సైనికశక్తిగా చెప్పుకునే ఇస్రాయిల్ సైన్యం ఇలాంటి పరాభవాన్ని ఎన్నడూ ఊహించలేదు. ఇది ఇస్రాయిల్ కు తలెత్తుకోలేని పరిస్థితి కల్పించింది.

హమస్‌ను  అమెరికా  టెర్రరిస్టు సంస్థగా ప్రకటించింది. కాని 2007 నుంచి గాజాలో హమస్‌దే ప్రభుత్వం. నిరంతరం ఇస్రాయిల్ సైనిక చర్యల  నీడలో  ఉన్నప్పటికీ హమస్ ఈ స్థాయి దాడి చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రస్తుతం ఇస్రాయిల్ రాజకీయ పరిస్థితి వివిధ పార్టీల మధ్య చీలిపోయి ఉంది. ఇంతకు ముందు జరిగిన యుద్ధంలో కూడా ఇస్రాయిల్ హమస్ పై పూర్తిగా పైచేయి సాధించలేకపోయింది. ఈ స్థాయిలో ఇస్రాయిల్ పై దాడి చేయడం వల్ల ఇస్రాయిల్ ప్రతిదాడులు ఉంటాయన్నది హమస్‌కు కూడా బాగా తెలుసని పలువురు భావిస్తున్నారు. ఇప్పుడు ఇస్రాయిల్ ఏం చేస్తుంది? ప్రతిదాడులకు పూనుకుని భీకరమైన బాంబుల వాన కురిపిస్తే జనసమ్మర్థం ఉన్న గాజాలో మానవహననమే జరగవచ్చు. ఈ పరిస్థితి ఇస్రాయిల్ లోని పాలస్తీనా జనాభా రెచ్చిపోయేలా చేస్తుంది. గల్ఫ్ ప్రాంతంలోని అరబ్బు దేశాలు ప్రతిస్పందించక తప్పని పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ఇస్రాయిల్ ప్రతిదాడుల్లో 160 మంది పాలస్తీనీయులు మరణించారని, వెయ్యి మంది గాయపడ్డారని వార్తలు వచ్చాయి. ఈ హింసాకాండ మరింత పెరిగితే అరబ్బు దేశాల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరగవచ్చు. అరబ్బు పాలకులకు ఇది ఇబ్బందికరమైన పరిస్థితి. ఇస్రాయిల్ అరబ్బు దేశాలతో సంబంధాలు మెరుగుపరచుకునే క్రమంలో ఉంది. ఈ ప్రయత్నాలన్నీ దెబ్బతింటాయి. ఆర్థికంగా ఇస్రాయిల్‌కు దెబ్బతగిలే పరిస్థితులు తలెత్తవచ్చు.  అలా అని హమస్‌పై గట్టి చర్యలు తీసుకోకపోతే ఇస్రాయిల్ బలహీనంగా కనబడుతుంది. నెతన్యాహు తన ప్రభుత్వం బలహీనంగా కనబడడాన్ని భరించగలిగే పరిస్థితులు ఇప్పుడు లేవు. ఇస్రాయిల్‌లోని నెతన్యాహు ప్రభుత్వాన్ని ముందు నుయ్యి, వెనుక గొయ్యి వంటి పరిస్థితిలో నెట్టేసింది హమస్ అని చాలా మంది భావిస్తున్నారు. నెతన్యాహు ఒకవైపు వెస్ట్ బ్యాంక్ లో, గాజాలో దౌర్జన్యాలు కొనసాగిస్తూ, సెటిల్మెంట్లను విస్తరిస్తూ మరోవైపు అరబ్బు దేశాలతో సంబంధాలు మెరుగు పరచుకుంటూ వస్తున్నాడు. పాలస్తీనా స్వతంత్ర దేశం అనేది ఏర్పడకుండా వేయవలసిన ఎత్తులన్నీ వేస్తూ వస్తున్నాడు. గాజా, వెస్ట్ బ్యాంకుల్లో ఇస్రాయిల్ దుర్మార్గాల వార్తలు ప్రతిరోజు వస్తూనే ఉంటాయి. పటిష్టమైన ఇంటిలిజెన్స్, ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్ వేర్లు, సైనిక ఔట్ పోస్టులు, చీమచిటుక్కుమన్నా, పక్షి రెక్క విప్పినా ఇస్రాయిల్‌కు తెలిసిపోతుందనే వాతావరణం సృష్టించాడు. కాని గాజాలో హమస్ ఇంత పెద్ద స్థాయి దాడికి ఏర్పాట్లు ఈ ఇంటిలిజెన్స్ కన్నుకప్పి చేయగలిగింది. ఈ  దాడి  చేసి  నెతన్యాహుకు ఏం చేయాలో తోచని స్థితికి నెట్టేసింది. తీవ్రమైన ప్రతిదాడులకు పాల్పడితే భారీస్థాయిలో ప్రాణనష్టం సంభవిస్తుంది. ఇస్రాయిల్ దాడుల్లో చిన్నపిల్లలు చనిపోయిన వార్తలు కొంతకాలం క్రితం వచ్చాయి. ఇస్రాయిల్ కొనసాగిస్తున్న ఈ దుర్మార్గాల పట్ల ఇప్పటికే అరబ్బు ప్రజల్లో వ్యతిరేకత ఉంది. కాని అరబ్బు దేశాల్లోని పాలకులు, అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, మొరక్కో, సూడాన్, సౌదీ తదితర దేశాలు ఇస్రాయిల్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవడం కూడా జరుగుతూ వస్తోంది. పాలస్తీనా గురించి ప్రత్యేకంగా చాలాసార్లు మాట్లాడే టర్కీ అధ్యక్షుడు  ఉర్దుగాన్ కూడా ఇటీవల ఇస్రాయిల్ ప్రధానిని కలిశాడు. ఇప్పుడు ఇస్రాయిల్ ప్రతిదాడులు చేస్తే, గాజాలో భారీ ప్రాణ నష్టం సంభవిస్తే ఈ అరబ్బు దేశాలు ఇస్రాయిల్‌తో సంబంధాల విషయంలో వెనకడుగు వేసే అవకాశాలున్నాయి. మరోవైపు ఈరాన్ నిర్ద్వంద్వంగా హమస్‌కు మద్దతుగా మాట్లాడింది. రష్యా మాజీ అధ్యక్షుడు కూడా ఇదంతా పాశ్చాత్యదేశాల పుణ్యమే అని ఈ దాడి జరగడంలో ఆశ్చర్యమేమీ లేదన్నాడు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత రష్యాను నిలువరించడానికి ఉక్రెయిన్‌కు భారీ సహాయం అందిస్తున్న పాశ్చాత్య దేశాలు ఇప్పుడు ఇస్రాయీల్ కు సహాయం అందించే పరిస్థితి. పాశ్చాత్య దేశాలు ఇప్పుడు ముప్పేట దాడిలో ఇరుక్కుపోయాయి. రష్యా ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. మరోవైపు చైనా కూడా తన పావులు మధ్యప్రాచ్యంలో కదుపుతుంది. ఇప్పుడు మధ్యప్రాచ్యం మునుపటి మధ్యప్రాచ్యం కాదు. ఈ పరిస్థితిలో నెతన్యాహు హమస్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి వెళితే యుద్ధం పూర్తిగా గెలిచే అవకాశాలు కూడా తక్కువ. గతంలో జరిగిన యుద్ధంలోను ఇస్రాయీల్ హమస్‌ను అణచలేకపోయింది. హిజ్బుల్లాతో యుద్ధం చేసి తన సైనిక బలం గురించి గొప్పలుపోయినా చివరకు మాడు బొప్పి కట్టి వెనక్కి తగ్గవలసి వచ్చింది. గాజాపై దాడులు తీవ్రం చేసి అరబ్బు దేశాల్లో ప్రజాగ్రహాన్ని కొని తెచ్చుకుని, ఫలితంగా దగ్గరవుతున్న అరబ్బు ప్రభుత్వాలను దూరం చేసుకుంటాడా? లేక హమస్ తీసిన దెబ్బను మరిచిపోయి పరిస్థితులు దిగజారకుండా జాగ్రత్త పడతాడా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. హమస్ మొదట దాడి చేసింది కాబట్టి ఇస్రాయీల్ ప్రతిదాడి చేసిందనే వాదన మధ్యప్రాచ్యంలో నిలబడదు. ఎందుకంటే ఇటీవలి కాలంగా ఇస్రాయీల్ అల్ అక్సా మస్జిద్ వద్ద చేపట్టిన చర్యలు, ఇస్రాయీల్ ఇటీవల కాలంగా చేస్తున్న దాడులకు ప్రతిదాడిగా హమస్ దాడిని చూసేవారే ఎక్కువ. ఈ లెక్కలన్నీ వేసిన తర్వాతనే హమస్ ఈ దాడికి దిగిందని చాలా మంది విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల ఇస్రాయీల్ సౌదీల మధ్య సంబంధాల వార్తలు హమస్ దాడికి ఒక కారణమనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇస్రాయీల్, సౌదీ సంబంధాలు అటకెక్కినట్లే అని చాలా మంది విశ్లేషిస్తున్నారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే, గాజాలో కేవలం ముప్పయి, ముప్పయి ఐదు కిలోమీటర్ల వెడల్పు, వంద కిలోమీటర్లు సుమారు పొడవు వున్న ఒక చిన్న ప్రాంతాన్ని అదుపు చేయలేకపోతున్న ఇస్రాయీల్ సామర్థ్యం ఇప్పుడు ప్రపంచంలో ఇస్రాయీల్‌ను తలెత్తుకోలేని స్థితికి తీసుకువచ్చింది.

ఇస్రాయీల్ ఉనికినే ఒప్పుకోమనే వారు కొందరు పాలస్తీనాలో ఉన్నారన్నది నిజమే. అలాగే పాలస్తీనాను పూర్తిగా ప్రపంచ పటం నుంచి తుడిచేయాలనుకునేవారు ఇస్రాయీల్ పాలకవర్గం లోనే ఉన్నారన్నది నిజమే. కాని అటు యూదుల్లోను, ఇటు పాలస్తీనా అరబ్బుల్లోను శాంతికాముకులు చాలా మంది ఉన్నారు. ఇస్రాయీల్ ఉనికిని ఒప్పుకుని శాంతియుతంగా జీవించాలనుకునే పాలస్తీనా అరబ్బులు ఉన్నారు, అలాగే పాలస్తీనా ఉనికిని, ప్రత్యేక దేశాన్ని ఒప్పుకుని కలిసి మెలిసి ప్రశాంతంగా బతకాలనుకునే యూదులు చాలా మంది ఉన్నారు. కాని ఈ శాంతిస్వరాలు యుద్ధబీభత్సాల్లో కొట్టుకుపోతున్నాయి.

హమాస్ దాడి జరిగిన తర్వాత తక్షణం భారత ప్రధాని ప్రతిస్పందించారు. ఇస్రాయీల్ పట్ల సంఘీభావాన్ని ప్రకటించారు. కష్టసమయంలో ఇస్రాయీల్ కు తోడుగా ఉన్నామన్నారు. నిజమే ఒక భయంకరమైన దాడి జరిగిన తర్వాత ప్రజాస్వామిక దేశంగా ప్రతిస్పందించడం, మన సానుభూతి ప్రకటించడం అభినందించదగిన విషయమే. కాని నెలల తరబడి మణిపూర్ తగలబడుతుంటే, హత్యాకాండలు జరుగుతుంటే, అత్యంత దారుణంగా మహిళలను వివస్త్రలు చేసి ఊరేగించిన సంఘటనలు జరుగుతుంటే ప్రధాని ఎందుకు నోరిప్పలేదని పలువురు చేస్తున్న విమర్శల్లోని ఔచిత్యం కూడా కాదనలేనిది. నరేంద్రమోడీ పరిపాలనలో దేశం చాలా భద్రంగా ఉందని, యుపీయే కాలంలో టెర్రరిస్టు దాడులతో అల్లకల్లోలంగా ఉండేదని రాజకీయంగా హమాస్ దాడిని వాడుకోడానికి బీజేపీ నేతలు ప్రయత్నించారు. ఆ వెంటనే కాంగ్రెస్ మోడీ హయాంలో జరిగిన 30 పై చిలుకు టెర్రరిస్టు దాడుల చిట్టాను విడుదల చేసి చూసుకోమంది.

ఇస్రాయీల్ పట్ల ప్రధాని సంఘీభావం ట్విటరు ద్వారా ప్రకటించడం కూడా చాలా మందికి మింగుడు పడడం లేదు. నిజానికి భారత ప్రభుత్వ వైఖరిని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన ద్వారా తెలియజేయాలి. కాని ప్రధాని స్వయంగా ముందుకు వచ్చి ట్వీటు చేయడం చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వంలో అంతా ప్రధాని నరేంద్రమోడీ తప్ప మరేమీ లేదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెసు పార్టీ అధికారిక ప్రకటనను ఈ సందర్భంగా గమనించాలి. హమాస్ దాడిని కాంగ్రెసు పార్టీ ఖండించింది. దాంతో పాటు పాలస్తీనా ప్రజలు ఆత్మ గౌరవంతో జీవించే హక్కును కూడా గౌరవించాలని, సలహా సంప్రదింపుల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని, ఇస్రాయీల్ భద్రతకు హామీ ఉండాలని పేర్కొంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రకటనలు సమతుల్యంగా, దౌత్యపరమైన పరిణామాలను అంచనా వేసుకుని విడుదల చేయవలసి ఉంటుంది. కాని ఎన్నికల రాజకీయాల కోసం మధ్యప్రాచ్యంలో సంఘటనలను వాడుకుంటూ, హమస్ దాడి జరిగిన వెంటనే కేవలం సంఘీభావ ప్రకటన చేసేయడం విచిత్రంగా ఉందని చాలా మంది భావిస్తున్నారు.

ఏది ఏమైనా మధ్యప్రాచ్యంలో హమాస్ చేసిన దాడి మధ్యప్రాచ్య సమీకరణాలనే కాదు, ప్రపంచంలో బలాబలాల తూకాలను కూడా మార్చేసే అవకాశాలున్నాయి. అలాగే ఇక్కడ రాజకీయాలపై, ముఖ్యంగా ఎన్నికల రాజకీయాలపై కూడా దీని ప్రభావం బలంగా పడే అవకాశం ఉంది.

★ ★ ★

‘చరితార్థులు’-2



# వలీ షాహ్

## (-1858)

19






9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**పరాయి పాలకుల** గులాంగిరికి సమ్మతించిన భోపాల్ సంస్థానాధీశుల చర్యలను సహించలేక ఆంగ్ల సైన్యాల మీద తిరగబడిన యోధుల నాయకుడు వలీ షాహ్. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ సంస్థానంలోని సైన్యంలో ఆయన రిసాల్దార్. 1818లో ఆంగ్లేయులతో భోపాల్ సంస్థానాధీశులు కుదుర్చుకున్న ఒడంబడిక మూలంగా సంస్థానాధీశురాలు సికిందర్ బేగం మీద, స్వదేశీయుల మీద ఆంగ్లేయుల ఆధిపత్యం అవధులు దాటింది. స్వదేశీ సైనికుల ఆత్మాభిమానాన్ని కించపర్చే చర్యలకు ఆంగ్లేయ సైన్యాధికారులు పాల్పడంతో రగులుకున్న ఆగ్రహం తిరుగుబాటుగా రూపుదిద్దుకుంది. ప్రజలను, సహచర సైనిక యోధులను తన అనర్గళ ప్రసంగాలతో ఆకట్టుకుని తిరుగుబాటు దిశగా సాగిన వలీ షాహ్ తన సహచరుడు హవల్దార్ మహావీర్‌తో కలిసి ‘నిషాన్-ఎ-ముహమ్మది’, ‘నిషాన్-ఎ-మహావీర్’ పేరుతో ఆకుపచ్చ, కాషాయ వర్ణాలతో కూడిన పతాకాలను 1857 ఆగస్టు ఎనిమిదిన సీహోర్ సైనిక స్థావరంలో ఎగురవేశారు. ఆంగ్లేయ సైన్యాధికారులు, సైనికులు పలాయనం చిత్తగించగా సైనిక స్థావరంలోని కంపెనీ ఖజానాను, ఆయుధా గారాన్ని స్వాధీనం చేసుకుని ‘కంపెనీ బహదూర్ సర్కార్’ స్థానంలో ‘సిపాయి బహదూర్ సర్కార్’ను వలీ షాహ్ ప్రకటించారు. ప్రభుత్వ యంత్రాంగ వ్యవస్థను లౌకిక-ప్రజాతంత్ర తరహాలో నడపడానికి సహచరులతో కూడిన ప్రత్యేక మండలి ఏర్పాటు చేసి, మండలి సలహా, సూచనల మేరకు కార్యాలయాలను, న్యాయస్థానాలను, పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. ‘సిపాయి బహదూర్ సర్కార్’ ప్రత్యేక చిహ్నాన్ని కూడా ప్రకటించారు. ఆ సందర్భంగా బహదూర్ షా జఫర్, ఝాన్సీరాణి లక్ష్మీ బాయి, బందా అధినేత అలీ బహదూర్ లాంటి యోధాగ్రేసురుల నుండి ప్రశంసలు అందుకున్నారు. ఆంగ్లేయులను భోపాల్ సంస్థానం నుండి మాత్రమే కాకుండా భారతదేశం నుండి పూర్తిగా తరిమివేసేందుకు తమతో కలిసి రావాల్సిందిగా భోపాల్ అధినేత సికిందర్ బేగంను వలీ షాహ్ ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ బేగం సికిందర్ ఆంగ్లేయుల పంచన చేరారు. సంప్రదింపులకు ఒంటరిగా రావాల్సిందిగా బేగం సికిందర్ మూడు సార్లు వలీ షాహ్‌ను ఆహ్వానించగా సహచరులతో కలసి మాత్రమే చర్చలకు రాగలనంటూ ఆమె ఆహ్వానాలను ఆయన తిరస్కరించారు. ఈలోగా సిహోర్, భోపాల్ పరిణామాలను వివరిస్తూ తిరుగుబాటును అణిచివేయడానికి బేగం సికిందర్ ఆంగ్లేయుల సహాయం అర్థించగా అత్యంత క్రూరుడిగా పేర్గాంచిన ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాధికారి జనరల్ హ్యూగ్ రోజ్ భోపాల్ చేరుకున్నాడు. ఆఘమేఘాల మీద భారీ సైన్యంతో 1858 జనవరి 14 సీహోర్ మీద విరుచుకపడ్డాడు. ఆ ఆంగ్లేయాధికారి కన్పించిన స్వదేశీ యోధుల మీద ఫిరంగి గుండ్లు, తుపాకి గుళ్ళ కురిపిస్తూ 356 మంది యోధులను బలి తీసుకున్నాడు. ఈ సందర్భంగా జరిగిన పోరులో ‘సిపాయి బహదూర్ సర్కార్’ అధినేత వలీ షాహ్ సాహసోపేతంగా పోరాడుతూ అమరుడయ్యారు. ✤

కథ



# కల నిజమవుతుంది

షేక్ అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం

అబ్బా జీ. అస్సలాము అలైకుం.

వ అలైకుముస్సలాం బేటా.

'నన్ను మరచి పోయావు కదూ?'

లేదు బేటా. ప్రతి రోజూ ఏదో ఒక సందర్భంలో నీవు గుర్తుకు వస్తూనే ఉంటావు. నువ్వు గుర్తుకు వచ్చినప్పుడల్లా నా కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే ఉంటాయి.

ఇంత చిన్న వయసులో మమ్మల్ని వీడి వెళ్లిపోయానని ఇంటిల్లిపాది ఏడుస్తుంటే, నువ్వు మాత్రం చాలా సంతోషించావు కదూ.

అవును బేటీ. కన్న తండ్రిగా కన్నీళ్ళు కార్చినా. ఒక విశ్వాసిగా చాలా సంతోష పడ్డాను. ఎందుకో తెలుసా? ఈ జీవితం శాశ్వతం కాదు. ఈ భూమి మీదకు వచ్చిన ప్రతి ప్రాణి ఏదో ఒక రోజు ఈ లోకాన్ని విడిచి వెళ్లాల్సిందే. ఇక్కడ చేసిన ప్రతి పనికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది.

ఈ మాయా ప్రపంచంలో ఎంత ఎక్కువ కాలం జీవిస్తే అంతగా సమాధానం చెప్పుకోవాలి. నా కూతురు చాలా అదృష్టవంతు రాలు. చిన్న వయసులోనే ఈ మాయా ప్రపంచాన్ని వీడి వెళ్ళి పోయి లెక్కా పత్రం నుంచి కాస్తయినా తప్పించుకుంది అని సంతోషించాను.

మరి నువ్వు ప్రతి రోజూ నా దగ్గరకు వచ్చి ఏడుస్తావు ఎందుకు?

ప్రవక్త ముహమ్మద్ (స) అంతటివారే, తన కుమారుడు చనిపోయి నప్పుడు కన్నీళ్ళు కార్చడం చూసి ఓ ప్రవక్తా! మీరు కూడా ఏడుస్తున్నారా? అని అడుగగా,

"కన్న కొడుకు లోకాన్ని విడిచి వెళ్ళిపోతే కన్నీళ్ళు కూడా కార్చని హృదయం పాషాణ హృదయం" అని అన్నారు.

నేను అతి బలహీనమైన విశ్వాసం కలవాడ్ని. కళ్ళ ముందే కన్న కూతురు వెళ్ళిపోతే, కన్నీళ్ళు కూడా కార్చకుండా ఎలా ఉండగలను తల్లి.

"అబ్బాజీ ! ఒకటి చెప్పనా."

"చెప్పు తల్లి."

'నాన్నా! బతికి ఉన్న వాళ్ళు, చనిపోయిన మాలాంటి వాళ్ళను చూసైనా కళ్ళు తెరవరు ఎందుకు? మేము మీరు ఊహించని రీతిలో ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయాం.'

ప్రవక్త ముహమ్మద్ ( స) పద్నాలుగు శతాబ్దుల క్రితమే చెప్పారు కదా అమ్మ. చనిపోయిన ప్రతి ఒక్కరూ అరచి అరిచి చెబుతారట.

ఖుర్‌ఆన్‌లో సృష్టికర్త అయిన అల్లాహ్ చెప్పినది అక్షర సత్యంగా మేము చూస్తున్నాము. ఓ బంధుమిత్రులారా! మేలుకోండి. మరణానంతర జీవితం కోసం పుణ్యాలను సమకూర్చుకోండి అని.

కానీ ప్రాపంచిక మాయలో పడి మరణాన్ని మరచి జీవిస్తున్న వారికి ఈ మాటలు వినబడవు.

నిజమే నాన్న. నేను కూడా ఇలాగే అరిచాను. కానీ అక్కడ ఉన్న ఎవరికి కూడా ఏమీ వినబడినట్లు అనిపించింది.

ఎందుకంటే?

"ప్రాపంచిక జీవితం ఒక మాయ తడిక తప్ప మరేమీ కాదు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు పరుగెత్తండి, ఒకరికంటే ఒకరు ముందుకు పోయే కృషి చేయండి; ఆకాశాలంత, భూమియంత విశాలమైన స్వర్గం వైపునకు పరుగెత్తండి. అది అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తలనూ విశ్వసించిన వారికొరకు సిద్ధం చేయ బడింది. ఇది అల్లాహ్ అనుగ్రహం, తాను కోరిన వారికి ఆయన దానిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఎంతో అనుగ్రహం కలవాడు. (57:21)

"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. ప్రతి వ్యక్తీ తాను రేపటి కొరకు ఏమి సమకూర్చుకున్నాడో చూసు కోవాలి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి, నిశ్చయంగా అల్లాహ్‌కు మీరు చేసే పనులన్నీ తెలుసు. అల్లాహ్‌ను మరచి పోయిన వారి మాదిరిగా మీరూ అయిపోకండి. (అల్లాహ్‌ను మరచిపోవటం వల్ల) అల్లాహ్ వారిని తమను తాము మరచి పోయేలా చేశాడు. వారే దుర్మార్గులు. నరకానికి పోయే వారూ స్వర్గానికి పోయేవారూ ఎన్నటికీ ఒకటి కాలేరు. అసలు స్వర్గానికి పోయేవారే కృతార్థులు. (59 :18-20)

నిజమే నాన్న గారు. మరణం తర్వాత తెలుస్తోంది అసలు నిజం. కాని అప్పుడు తెలిసిరావడం వల్ల ప్రయోజనం లేదు కదా. అబ్బా జీ. నేను నిజంగా అదృష్టవంతురాలినే.

ఎందుకమ్మా!

కాస్తో కూస్తో దైవ ధర్మ ప్రచారం చేసే అవకాశం లభించింది.

ఖురాన్ చదివి కాస్తయినా ఆచరించే అవకాశం నాకు కలిగింది. నువ్వు రోజూ నా దగ్గరకు వచ్చి ఖుర్‌ఆన్ చదివి నాకోసం దుఆ చేస్తావు. అమ్మ రాత్రుళ్ళు నిద్ర లేచి నన్ను తలుచుకుంటూ ఏడ్వడం కాస్త బాధ కలుగుతుంది.

నా రూపంలో మీరు మనవరాలు మనహాను చూసుకుంటూ అది చేసే అల్లరి పనులు చూసి మురిసిపోవడం చూసి ఆనందం కలుగుతుంది.

నిజమైన ఇస్లామీయ మార్గంలో మనవరాలిని పెంచుతారని, అది చేసే పుణ్యకార్యాలలో నాకు, మీకు నరకాగ్ని నుంచి కాస్తైనా ఉపశమనం కలుగుతుందన్న ఆశ.

'ఇన్షాల్లాహ్ . అలాగే అమ్మ. నా ప్రయత్నం నేను చేస్తాను. ప్రతి రోజూ అదే దుఆ చేస్తున్నాను'-

అల్లాహ్ మా అందరి చేత నీ ధర్మ సంస్థాపనా కార్యం పనులు చేసి పరలోకంలో నరకం నుండి కాపాడు అని

అలాగే అబ్బా జీ. అల్లాహ్ మీ దుఆ స్వీకరించుగాక.

ఆమీన్ సుమ్మ ఆమీన్.

ఏంటి నిద్రలో కూడా ఆమీన్ అంటున్నారు. లేవండి స్కూల్‌కు వెళ్ళే టైం అవుతుంది.

ఒహ్! ఇదంతా కల నా. అనుకుంటూ కళ్ళు నలుపుకుంటూ మంచం మీద నుంచి లేచా. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ, నైతిక పథకం
గీటురాయి
వారపత్రిక

(అక్టోబర్ 22 అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి సందర్భంగా)



# ఉరి తాడును ముద్దాడిన వీరుడు

- యండి. ఉస్మాన్ ఖాన్

'నాకు ఏ కోరికా లేదు. ఉన్నదల్లా ఒక్కటే. కఫన్‌లో నా జన్మభూమి మట్టిని కాస్త ఉంచండి. అంతేచాలు.' దేశస్వాతంత్ర్యం కోసం ఉరి తాడును ముద్దాడుతూ భారతదేశ ముద్దుబిడ్డడు అమరజీవి అష్ఫాఖుల్లాఖాన్ పలికిన చారిత్రక పలుకులివి. ఈ మట్టిని, ఈ దేశాన్ని అష్ఫాఖ్ ఎంతగా ప్రేమించాడో తెలుసుకోడానికి ఈ ఉదాహరణ చాలు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన యువ కిశోరాల్లో అష్ఫాఖ్ ప్రముఖుడు.

వయసుకు మించిన పరిణతితో కేవలం 27 సంవత్సరాలకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి ఉరితాడును ముద్దాడాడు. ఆంగ్లేయులకు సింహస్వప్నమై ముచ్చెమటలు పట్టించిన అష్ఫాఖుల్లాఖాన్ 1900 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్ పూర్‌లో జన్మించాడు. మజ్హరున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ తల్లి దండ్రులు. ఆరుగురు సంతానంలో అష్ఫాఖ్ చిన్నవాడు. మిషనరీ స్కూల్‌లో చదువుకున్నాడు. తల్లి దండ్రులు విద్యావంతులు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. అష్ఫాఖ్ ప్రాథమిక ఇస్లామీయ పరిజ్ఞానమంతా తల్లి దగ్గరే నేర్చుకున్నాడు. అష్ఫాఖ్‌కు ధార్మిక విద్యకోసం తల్లిదండ్రులు ఒక గురువును ఏర్పాటు చేశారు. ఆంగ్లేయుల దాష్టీకాలను, దేశంనుండి వారిని తరిమేయాల్సిన అవసరాన్ని విడమరిచి చెప్పే గురువుమాటలు అష్ఫాఖ్‌ను అమితంగా ప్రభావితం చేశాయి. విద్యావంతుల కుటుంబం కావడం, స్వయంగా విద్యాధికురాలైన తల్లి అష్ఫాఖ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం మూలంగా పిన్న వయసులోనే అతనికి గొప్ప జ్ఞాన సంపద సమకూరింది. రాజకీయాలతో సంబంధంలేని కుటుంబ నేపథ్యమైనా, తన ఆలోచనలు రాజకీయంగానే సాగేవి. దీంతో అష్ఫాఖ్ ఎప్పుడు విప్లవోద్యమంలోకి దూకి, ఆంగ్లేయుల పని పట్టాలా.. అని ఆలో చిస్తుండేవాడు. సరిగ్గా ఆ సమయంలోనే గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు. విద్యార్థిగా ఉంటూనే అష్ఫాఖ్ ఆ ఉద్యమంలో పాల్గొన్నాడు. దీంతో మిషన్ స్కూల్ ఆయన్ని పాఠశాలనుండి బహిష్కరించింది. కుటుంబీకులు కలవరపడ్డారు.

అయినా అష్ఫాఖ్ బెదరలేదు. ప్రభావశీలురైన ప్రపంచ విప్లవ

వీరుల చరిత్రలు చదివి తను కూడా వారిలాగే మారాలనుకునేవాడు. మాతృదేశం కోసం పోరాడి చరిత్రలో నిలిచిపోవాలని, దానికోసం తాను ఏమైపోయినా పరవాలేదని దృఢంగా నిర్ణయించుకున్నాడు. రాంప్రసాద్ బిస్మిల్‌ను కలుసుకున్నాడు. అష్ఫాఖ్ ముస్లిం కావడంతో ఆర్యసమాజ సభ్యుడైన బిస్మిల్ మొదట్లో అతన్ని శంకించాడు. చివరికి ఇద్దరి లక్ష్యం ఒకటే కావడంతో సనాతన హిందువైన రాంప్రసాద్ బిస్మిల్‌కు, సాంప్రదాయ ముస్లిం అయిన అష్ఫాఖ్‌కు గాఢమైన స్నేహం ఏర్పడింది. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం ఒక్కటై భావితరాలకు ఆదర్శంగా నిలిచారు. ఉద్యమ అవసరాలకోసం 1925 ఆగష్టు 9 వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ , చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మరికొందరు విప్లవకారులు కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిష్ ఖజానాకే గురి పెట్టడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంత పనైతే, ఉద్యమకారులకు కొత్త ఉత్సాహాన్ని అందించినట్లయింది. దీన్ని బ్రిటిష్ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సెప్టెంబరు 26న రాంప్రసాద్ బిస్మిల్‌ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ ఇంటిపై కూడా దాడిచేశారు. కాని అష్ఫాఖ్ దొరక్కుండా తప్పించుకున్నాడు. కొన్నాళ్ళపాటు బనారస్‌లో అజ్ఞాతంలో గడిపి ఢిల్లీ చేరుకున్నాడు. మిత్రుడు చేసిన నమ్మకద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా అష్ఫాఖ్ భయపడలేదు. చివరికి 1927 డిసెంబర్ 19వ తేదీన అష్ఫాఖ్‌ను ఉరి తీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ అష్ఫాఖ్ , మాతృదేశ విముక్తికోసం ఉరి కంబాన్ని ఎక్కబోతున్నందుకు గర్వపడుతున్నానని ప్రకటించాడు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఇన్ని కోట్ల ముస్లిం జనాభాలో దేశం కోసం బలిపీఠమెక్కబోతున్న తొలి ముస్లింను తానే అయినందుకు సంతోషంతో పొంగిపోతున్నానని గర్వంగా చెప్పుకున్నాడు. ఉరితాడును పూమాలగా స్వీకరించి, తన దేశభక్తిని చాటుకున్నాడు. ఆ రోజు రానే వచ్చింది. అష్ఫాఖ్ తెల్లవారు ఝామున్నే నిద్రలేచి స్నానం చేశాడు. శుభ్రమైన వస్త్రాలు ధరించి, నమాజు (దైవప్రార్థన) ఆచరించాడు. తరువాత ఖుర్‌ఆన్ పారాయణం.. అంతలో జైలు అధికారులు వచ్చారు. పలకరింపుగా వారిని చూస్తూ, 'ఏర్పాట్లు పూర్తయ్యాయా?' అని ప్రశ్నించాడు చిరునవ్వుతో.. 'మన్నించండి, మేము నిమిత్తమాత్రులం' అన్నారు వారు. 'అయ్యో.., ఉద్యోగులుగా మీ ధర్మం నెరవేర్చారు. ఇందులో మీ తప్పేమీ లేదు' అంటూ, ఖుర్‌ఆన్ గ్రంథం చేత పట్టుకొని 'దేవా..వచ్చేస్తున్నా..!' అంటూ వధ్యస్థలి వైపుకు కదిలాడు మందహాసంతో.. ప్రాతఃకాల ప్రకృతి మాత ఈ తతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది. అమరజీవి అష్ఫాఖుల్లాఖాన్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పొయ్యాయి. భూప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ అష్ఫాఖ్ త్యాగం సజీవంగా ఉంటుంది. ✤


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

**లేదా**

**పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.**

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అధ్యాయం 1

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

**“మీరు సహాయ పడతారన్న నమ్మకంతో వచ్చాను,** నాతో పాటు కొంత దూరం వెళ్ళాలి”– ఆగంతకుడు జంకుతూ అడిగాడు.

“ పదండి, తప్పక వస్తాను”– వెంటనే లేచారాయన.

ఆగంతకుడు తాను వెళ్లే చోటికి దగ్గరి దారిన బయలుదేరాడు. చాలా దూరం వెళ్ళిన తరువాత, “ఇక ముందుంది ఈ దారిలో దుర్మార్గులున్న చోటు, కాస్త జాగ్రత్తగా ఉండాలి” హెచ్చరించాడు అతడు. అంతే, ఆగిపోయారాయన.

“నేను అటువంటి జనులతో మెలగడం ఇష్టపడను, నన్ను మన్నించండి” అంటూ వెను తిరిగారాయన.

ఆయన పేరు అబ్దుల్లా, ఆయన సహజంగానే ఉత్తమ గుణ సంపన్నులు. సకల చెడుగులకు దూరంగా మెలగటం, మంచిని గ్రహించిన వెంటనే తనదిగా చేసుకోవడం ఆయన ప్రవృత్తి. ఉన్నత సంస్కారం ఆయన స్వంతం. ఆచితూచి, అయితే సున్నితంగా మాటలాడటం, వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. కవితలు కూడా అల్లేవారు. కవి హృదయం కావటాన మృదు స్వభావి! ఒకరు కష్టం అనుభవించడం సహించలేరు, సహాయానికి ప్రప్రథమంగా అడగక ముందే ముందుకు రావడం ఆయనకు అలవాటు! అందుకే అబూ బక్ర్ (మున్ముందు ఉండేవారు) అని పిలిచే వారు జనులు! పేరు కన్నా తనకు అబ్బిన గుణ నామం (అబూ బక్ర్) తోటే ఆయన వినుతి కెక్కారు. తన దేశంలో ప్రతి చోటా ఆయన సహాయానికి ఋణపడి ఉన్న వారు ఎందరో!

ఆయన ఎవరో కాదు చరిత్రలో ‘నిర్ధారణాగ్రేసరుడు’ (సిద్దీక్)గా వినుతికెక్కిన అబూ బక్ర్ (ర)!

మద్యపానానికి తొలి నుంచి దూరమయి ఉండేవారు, వడ్డీ వ్యవహారమన్నా, జూదం అన్నా ఆయనకు జుగుప్స! విగ్రహారాధనకు తండ్రి ఎంతగా పురికొలిపినా ఆయన ఎన్నడూ దానికి తల ఒగ్గలేదు. ఇస్లామ్ స్వీకృతి తరువాత ఈ సద్గుణాలన్నీ మరీ వికసితమయ్యాయి!!

## ఇస్లామ్ స్వీకారం

ఇస్లామ్ స్వీకరించక మునుపే ఆయన, సత్య ప్రియత, దయార్ద్రత, అప్పగింత పరిరక్షణ– ఇత్యాది సద్గుణాలకు పెట్టింది పేరు. ఆయన బాల్య దశ నుంచీ ప్రవక్త మహనీయుల ప్రియ మిత్రులు. ఆయన మహనీయ ముహమ్మద్(స) కన్నా దాదాపు రెండున్నర ఏళ్లు చిన్న. ప్రవక్త శ్రీ (స) క్రీ.శ. 571లో పుడితే, అబూ బక్ర్ క్రీ.శ. 573లో పుట్టారు. ఇరువురి గుణగణాల సమానత కారణంగా మైత్రి అనుదినం ప్రవర్ధమానం, గాఢతరం అవుతూనే వచ్చింది. కడకు దైవం కనికరించి తన అంతిమ సందేశం చివరి ప్రవక్త ద్వారా మానవాళికి అందజేసేందుకు నిర్ణయించుకున్నాడు!

అది రమజాన్ నెల 25వ, (క్రీ.శ.610,ఆగస్టు 6) తేదీ, అత్యుత్తమ రేయి. హిరా గుహలో తొలి వహీ అవతరించిన శుభ ఘడియ! ఆ తరువాత దైవ ప్రవక్త, దైవాదేశం ప్రకారం దైవ సందేశాన్ని అతి సన్నిహితులకు రహస్యంగా అందజేశారు. ఆ సందర్భంలో మహనీయ ముహమ్మద్ (స) ని ప్రవక్తగా నమ్మిన వారు నలుగురు–మహనీయ ఖదీజా ( ప్రవక్త సతీమణి), మహనీయ అబూ బక్ర్, మహనీయ జైద్ బిన్ హారిసా, ఓ తొమ్మిదేళ్ల బాలుడు మహనీయ అలీ. ఈ నలుగురు భాగ్యవంతులు ప్రవక్త మాట వినగానే, ఆయన తెలిపిన కలిమా (సద్వచనాన్ని) **"లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** పఠించి హృదయపూర్వకంగా నమ్మినవారు.

మహనీయ ఖదీజా, సతీమణి కావటాన, జైద్, ప్రవక్త నౌకరు కావటాన, అలీ, బాబాయి కుమారుడు ఇంకా ప్రవక్త పెంపకంలో ఉండటం మూలాన ఇస్లామ్ స్వీకరించడం బహుశా ఆశ్చర్యకరం కాదేమో, కాని అబూ బక్ర్ కేవలం మిత్రుడు మాత్రమే! ప్రవక్త(శ్రీ చెప్పేవారు, "నేను ఈ సద్వచనాన్ని ఎవరి సమక్షంలో పెట్టినా వారిలో ఎంతో కొంత జంకు అగుపించింది, కాని అబూ బక్ర్ దీన్ని వినగానే అర క్షణం కూడా జాగు చేయకుండా స్వీకరించారు."

## నిర్ధారణాగ్రేసరుడు

మరో సంఘటన కూడా ఆయన్ని నిర్ధారణాగ్రేసరుడుగా ధ్రువీకరిస్తుంది. ప్రవక్త మహనీయులు మేరాజ్ వృత్తాంతం మక్కా వాసులకు వినిపించినప్పుడు అక్కడ అబూ బక్ర్ లేరు. మక్కా వాసులు ప్రవక్త శ్రీ ని బాగా హేళన చేశారు. వారిలో కొందరు పరుగు పరుగున మహనీయ అబూ బక్ర్ వద్దకు వెళ్లి, "విన్నావా, మీ ప్రవక్త గారు ఈ వేళ ఏం చెప్పారో! ఆయన గారు, రాత్రికి రాత్రే బైతుల్ మక్దిస్ (జెరూసలేం) వెళ్లి తిరిగి వచ్చేశారట!... ఇంకా నమ్మండి ఆయన మాటలు."

దానికి అబూ బక్ర్, "వాస్తవంగా ఆయన ఇలా చెప్పారా?" అని అడిగారు.

"అవును ఇప్పుడే విని వస్తున్నాము" అన్నారు వారు.

"అయితే అందులో సందేహమేముంది, అది ముమ్మాటికీ నిజం!"

"ఏమిటి? మీరు ఆయన రాత్రికి రాత్రి బైతుల్ మక్దిస్ వెళ్లి తెల్లారక మునుపే తిరిగి వచ్చేశారన్న దాన్ని ధ్రువీకరిస్తున్నారా?" అని ప్రశ్నించారు మక్కా వాసులు.

"అవును, దీన్ని ధ్రువీకరించడంలో విశేషం ఏముంది? దీన్నే కాక ఇంకా ముందుకు వెళ్లి ఆయన వద్దకు రోజూ దివి నుండి దైవిక సందేశాలు వస్తూ ఉంటాయనీ నేను నమ్ముతాను" అని బదులిచ్చారు మహనీయ అబూ బక్ర్!

మరో ఉదంతం. దాదాపు ఆ కాలంలోనే రోమను సామ్రాజ్యానికీ– ఈరాన్ (పర్షియన్) సామ్రాజ్యానికీ మధ్య యుద్ధం జరిగింది. రోమనులు గ్రంథవహులు, అంటే ఒకే దైవం ఆరాధకులు. ఈరానీయులు అగ్ని పూజారులు. అంటే బహుదైవ విశ్వాసం గలవారు. ముస్లిములు సహజంగానే రోమనుల పట్ల సానుభూతి గలవారు, కాని మక్కా బహు దైవారాధకులు తమతో భావ సమైక్యత కారణంగా ఈరానీయుల సమర్థకులు. ఆ యుద్ధంలో ఈరాన్, రోమనులపై ఆధిక్యత సాధించింది. ఇది మక్కా బహు దైవారాధకులకు సంతోషం కలిగిస్తే ముస్లిముల మనస్తాపానికి కారణమయింది.

ఆ సందర్భంలో మక్కా బహుదైవారాధకులు అబూ బక్ర్‌ని అవహేళనగా, "చూశారా! మీ గ్రంథ వహులు ఓడిపోగా మా బహుదైవారాధకులు గెలిచారు" అంటూ వెటకారం చేశారు. దానికి అబూ బక్ర్ బాగా బాధ పడ్డారు. ఆ తరువాత 'అర్ రూమ్ సూరా' అవతరించింది. దాని ప్రారంభ వచనాలు:

రోమనులు సమీప భూభాగంలో పరాధీనులయ్యారు. మరి ఈ పరాధీనత తరువాత కొన్ని సంవత్సరాలలోనే తిరిగి ఆధిక్యత సాధించనున్నారు. *(అర్ రూమ్ 30 : 2,3)*

అంటే దివ్య ఖుర్ఆన్ కొన్నేళ్ల లోపున జరగబోయే విషయం భవిష్యవాణిగా ప్రకటించింది! ప్రవక్త మహనీయులు (స) ఈ వచనాలు వినిపించగానే మక్కా బహు దైవారాధకులు పరుగు పరుగున అబూబక్ర్ (ర) వద్దకు వెళ్లి, "ఇదో విన్నారా! మీ ప్రవక్త గారు ఓ వింతయిన భవిష్యవాణి వినిపించారు, అది జరగడం మాత్రం దుస్సాధ్యం!" అని వెటకారంగా అన్నారు. మహనీయ అబూ బక్ర్, అర క్షణం కూడా తటపటాయించక, "దైవ ప్రవక్త ఇలా నుడివారంటే, తప్పక అలాగే జరుగుతుంది!" అని వాళ్ల నోరు మూయించారు!!

అందువల్లనే ఆయన నిర్ధారణాగ్రేసరుడు!!!

ఆ పైన అదే జరిగింది. మహనీయ అబూబక్ర్ (ర) నిర్ధారించినట్లే కొన్నేళ్ల లోపునే రోమనులు ఈరానీయుల పైన ఆధిక్యత సాధించారు, ఈరానీయులు చిత్తు చిత్తుగా ఓడిపోయారు!

ఒకసారి ప్రవక్త (శ్రీ(స) మక్కాపుణ్యపురిలో ప్రసంగిస్తూ ఇలా అన్నారు, "దైవం నన్ను మీ వద్దకు ప్రవక్తగా పంపాడు, మీరు నన్ను అబద్ధం పలుకుతున్నట్లుగా నిందించి తిరస్కరించారు". అప్పుడు అబూ బక్ర్, "నిస్సందేహంగా మీరు సత్యవంతులు" అని ధ్రువీకరించారు.'


దైవప్రవక్త పట్ల ఆయన విశ్వాసం అలాంటిది!

**(మిగతా వచ్చే సంచికలో)**

# కన్యాశుల్కంలో ఉర్దూ పద ప్రయోగాలు

**- వాహెద్**

**(గత సంచిక తరువాయి)**




కన్యాశుల్కంలో అనేక ఉర్దూ పదాలు కనిపించడానికి కారణాలు కూడా మనం చూశాం.

మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు గిడుగు రామమూర్తి పంతులు గారు వ్యవహారికోద్యమం కోసం నడుం కట్టకముందు కూడా పాలనాపరమైన రాతకోతల్లో, న్యాయస్థానాల్లోని రాతకోతల్లో నడిచింది వ్యావహారిక భాషే. బ్రౌన్ ఆ ఉదాహరణ ఇచ్చారు. నాలుగు పంక్తుల్లోనే అనేక ఉర్దూ, ఇంగ్లీషు పదాలు మనకు కనిపించాయి. గిడుగు రామమూర్తి పంతులుగారు తన బాలకవి శరణ్యంలో చెప్పిన మాటలు కొన్ని ఇక్కడ ప్రస్తావించుకోవడం అవసరం.

''మన తెలుగు భాషలో అన్యదేశ్యములు అనేకమున్నవి. కవులు కూడా వాడుతున్నారు. అట్టి శబ్దములు ఏయే భాషల నుండి ఎప్పుడెప్పుడు వచ్చి తెలుగులో చేరినవో, ఎలాగున మారినవో మన తెలుగు పండితులు విచారించలేదు. శ్రీ వావిలి కొలను సుబ్బారావు పంతులు గారు తమ సులభ వ్యాకరణములో రోజు, ఖర్చు, జమ, జాబు మొదలయిన తురకమాటలు ప్రయోగార్హ ములు కావని నిషేధించినారు గాని ఆయన రచించిన సుభద్రా విజయము (పుట 54)లో 'కంతుతేజీ' అని ప్రయోగించినారు 'తేజీ' అన్న పదమేభాషో?... మన దేశమును ముసల్మాను ప్రభువులు చాలా కాలము పరిపాలించి యుండినందునను, ఆ మతము వారు తురుష్కులు, పఠానులు, అరబ్బులు మొదలగు వారు అన్ని మండలములలోను స్థిర నివాసము ఏర్పర్చుకొని మనకు తోడికాపులయి ఉన్నందున, వారి భాషలో చేరిన అరబ్బీ, పారసీ, తుర్కీ మాటలు ఒక్క మన తెలుగులోనే కాదు అన్ని భాషలలోను చేరినవి.

ఈ ''తురక మాటలు'' అపరిహార్యములు. సరస కవితకు ఆలంబనములు, శ్రీనాథుడు అక్కడక్కడా ఒక్కొక్క మాట 'ఖుసి మీరన్' అని ప్రయోగించాడు. నార్మను రాజులు ఇంగ్లాండు జయించి పాలించిన కాలమందు నార్మన్, ఫ్రెంచి శబ్దములు, ఇంగ్లీషులో కలసినట్లే, మన తెలుగులో ఉర్దూ మాటలు చేరి, భాషాభివృద్ధికి కారణము లయినవి. సాలాఖరువలెనే నెలాఖరు, మాసవారీ, బేమర్యాద, పెత్తనదారుడు, కలక్టరీ, నిజాయితీ, గుమాస్తాగిరి, బంట్రోతుగిరి ఎంత పొందికగలిగి యున్నవో చూడండి. వేలకొలదిగా ఉన్న ఈ హిందుస్తానీ మాటలు నిత్య వ్యవహరములో ఆంధ్ర భారతి శరీరములోని అంగములయినవి. ఛేదిస్తే గాయములు పడక తప్పదు. ఇంగ్లీషు మాటలు, సంస్కృత శబ్దములు, ఉర్దూ పదములు మన భాషలో కలిసిపోయిన వన్నీ మన మాటలే. అవి విడిచితే వ్యవహార హాని... తెలుగులో కలిసిపోయిన అనాంధ్ర శబ్దములన్నీ పూర్వము ఏ భాషలోనివైనా ఇప్పుడు తెలుగులే. నేటి వ్యావహారికాంధ్ర భాష అభినవాంధ్ర

భారతి యొక్క వాఙ్మయ శరీరము భాషలో చేరిన అన్యదేశ్యాలు ఆమె శరీరములో అంతర్భూతములే. అవి, అవసరమును బట్టి వేసే వేషాలు, పెట్టుకునే అలంకారాలు, పూసుకొనే మెరుగులు.''

తెలుగును పరిశుద్ధం చేద్దామంటూ ఆంగ్ల పదాలు తొలగించే ద్దామని ఉద్యమాలు చేస్తూ, కొన్ని ఎవరికీ అర్థం కానీ తెలుగు పదాలు ప్రాచుర్యంలోకి తీసుకొద్దామని చాలా ప్రయాసపడే వారు, తెలుగు భాషలో దాదాపు ముస్లిం పరిపాలకుల పాలన కాలమైన ఏడు వందల ఏళ్ల నుంచి తెలుగు మాత్రమే కాక దేశ భాషలలో విడదీయరానంతగా కలగలిసిపోయిన హిందూస్తానీ పదాల గురించి ఏమీ మాట్లాడరు. ఎందుకంటే ఇవి విడదీయరాని సహజత్వాన్ని సంతరించుకోవడం వల్ల కూడా అసలు ఇవి హిందూస్తానీ లేక ఉర్దు పదాలని గుర్తించడం కూడా ఇవాళ కష్టం.

తెలుగు భాషలోకి వచ్చిన వేలాది ఉర్దూ పదాలను చూస్తే ఈ ఉర్దూ పదాలను తెలుగు నుండి ఇక తొలగించలేమేమో అనిపిస్తుంది. అవి పూర్తిగా తెలుగు పదాలు అయినట్లుగా, తెలుగులో స్థిరపడిపోయినట్లుగా భావించే బ్రౌన్, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులో వాటి అర్థాలను ఇచ్చాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ రీడరు డాక్టర్. కె. గోపాల కృష్ణరావు గారు "తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము" అనే తన గ్రంథంలో ఆది కవి నన్నయ మొదలు సి.నారాయణ రెడ్డి వరకు ఎందరో తెలుగు కవులు తమ రచనలలో ప్రయోగించిన ఉర్దూ, పార్శీ పదాలను సోదాహరణంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి బహుమతి పొందిన ఈ పుస్తకాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు 1968లో ప్రచురించింది. బ్రౌణ్య నిఘంటువులో కానరాని అనేక ఉర్దూ పదాలు, ఉర్దూతో మిళితమయిన తెలుగు పదాలు ఎన్నో ఈ గ్రంథంలో దర్శనమిస్తాయి. 'తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము 'పరిశిష్టము' లో గోపాల కృష్ణారావుగారు ఇలా అన్నారు. "ఇప్పుడు దేశమునందుకాని రాష్ట్రమునందు కాని ఉరుదూ పారశీకములకు అధికార భాషాస్థాయి లేదు. కొన్ని రాష్ట్రములలో మాత్రమే ఉరుదూ అనుబంధ అధికార భాషగా స్వీకరింపబడినది. ఇట్టి పరిస్థితులందును ఉర్దూ పారశీక ప్రభావము ప్రసరించుచున్న అంశము విస్మరింపరానిది. పత్రికల భాష, వివిధ సంస్థల ప్రకటనలు, ప్రభుత్వ శాసనములు, చట్టములు వ్యవహారభాష మున్నగు వానిని పరిశీలించినచో ఈ అంశము స్పష్టమగును... ఉరుదూ పారశీకములందు అరబీ భాష నుండి పెక్కు పదములు ప్రవేశించినవి. కనుక పరోక్షముగా అరబీ పదములు కూడా తెలుగులో చేరినవనుట నిశ్చయము. చారిత్రక దృష్టితో చూచినచో ద్రావిడ భాషలపై అరబీ భాష ప్రభావమే మొట్టమొదట కలిగినట్లు కన్పించును... నావికుల పదజాలమును పండితులు పరిశీలించినచో, అమూల్యమయిన అంశములు వెల్లడియగును, పారిభాషిక పదములను రూపొందించుకొనుటలో తెలుగు వారు ఉదారదృష్టి వహించుట అవసరమే. ప్రతి పదము కూడా అచ్చమయిన తెలుగు పదముగా మాత్రమే ఉండవలయునను నిర్బంధమును పూనినచో కార్యము క్లిష్టతరమగును. సంకుచిత దృష్టితో మడిగట్టుకొని పారిభాషిక పదములను తెలుగు పదముల తోడనే బలవంతముగా నిర్మించుకొనినచో అవి బహుజన ఆదరపాత్రములు కాక వ్యవహారమును కష్టతరమొనర్చును. విధిలేనపుడు ఎంత గొలుసు పదములను, చిత్ర విచిత్రములైన పదములను నిర్మించుకొనుట శాస్త్రసిద్ధమైన మార్గము కాదు. జేబురుమాలు, గుండీ, అంగీ, కుడ్తా,టోపి, అమలు, వాయిదా వంటి పదములకు సమానార్థకములగు తెలుగు పదములను ప్రత్యేకముగా కృషి సలిపి నిర్మించుకొనుట వృధా శ్రమయని అనుభవజ్ఞుల అభిప్రాయము... నిత్య పరివర్తన శీలమయిన భాషకు నిర్బంధములు తగవు. అన్యభాషల నుండి పదములు స్వీకరించినంత మాత్రమున తెలుగు భాష గౌరవ ప్రతిష్టల కెట్టి భంగము వాట్లిలదు. తెలుగు ఇంకను పరిపుష్టమగును...ఆదాన ప్రదాన పద్ధతి ఉభయ భాషా సాహిత్యములకు లాభదాయకము. దక్షిణాది భాషలపై ఉర్దూ పారశీకముల ప్రభావమును తులనాత్మకముగా పరిశీలించి తెలుగుపై ప్రసరింపజేసిన ప్రభావ వైశిష్ట్యమును కూడా నిరూపించుటకు పండితులు కృషి యొనర్పవలసియున్నది. ఇట్టి పరిశోధనకు కృషికి పునాదిగా పనికి వచ్చునది పదజాలము. ఈ పదజాలమును నిఘంటువు రూపమున సంతరించుట ఎంతయో అవసరము. ఇది ఒకరి వలన అగు కార్యము కాదు. బహుభాషజ్ఞులగు పండితుల సహాయముతో సాహిత్యసంస్థలు, అకాడమీలు బృహత్ప్రణాళికను సిద్ధము చేసి సాధింపదగిన కార్యము. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అన్యదేశ్య నిఘంటువును కూడా నిర్మించుటకు సాహసింపవలయునని వినయపూర్వకముగా విన్నవించు కొనుచున్నాను.''

జాతీయాలు, సామెతలు, లోకోక్తులు, యాస పదాలు క్రోడీకరించి పరస్పరం అనువదించి గ్రంథాలుగా వెలువరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాషాప్రియ సంస్థలీ పనికి పూనుకోవాలి.

**(ఇంకా వుంది...)**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

13 ఆయన మీ కొరకు నిర్దేశించిన ధర్మ విధాన ఆదేశమే నూహ్‌కు ఇచ్చాడు, దాన్ని (ముహమ్మద్!) ఇప్పుడు నీ వద్దకు మేము వహీ ద్వారా పంపాము; దానినే మేము ఇబ్రాహీమ్, మూసా, ఈసాకు బోధించి ఉన్నాము, స్థాపించండి ఈ ధర్మాన్ని, అందులో విభేదించుకోకండి అన్న గట్టి నిర్దేశనతో. (ముహమ్మద్!) దేని వైపునకు నీవు వీరికి పిలుపు నిస్తున్నావో ఆ విషయమే ఈ బహుదైవారాధకులకు తీవ్రంగా అయిష్టకరమయినది. అల్లాహ్ తాను కోరిన వానిని తన వానిగా చేసుకుంటాడు; తన వద్దకు చేరే దారినీ ఆయన, తన వైపునకు మరలేవారికే చూపిస్తాడు.[21]

14 జనుల్లో విభేదం పొడసూపడం అన్నది, వారి వద్దకు జ్ఞానం వచ్చేసిన తరువాతనే జరిగింది.[22] అదీ, వారు ఒండొకరిపైన దౌర్జన్యం చెయ్యాలని అనుకోవడం వల్లనే జరిగింది.[23] నీ ప్రభువు ముందుగానే ఒక నిర్ణీత కాలం వరకు తీర్పు వాయిదా వెయ్యాలని పురమాయించి ఉండకపోతే వారి వివాదం తీర్చివెయ్యబడి ఉండేది. వాస్తవం ఏమిటంటే, పూర్వపు వారి తరువాత గ్రంథానికి వారసులయినవారు దాని విషయంలో ఎంతో కలత కారకమయిన ఆశంకలో పడి ఉన్నారు.

21. ఇక్కడ తిరిగి, 8,9వ ఆయత్‌లలో పేర్కొన్న విషయాన్నే పునరుక్తం చేయడం జరిగింది. దీని వివరణ మేము 11వ పాదసూచిలో చేసి ఉన్నాము. ఇక్కడ ఈ విషయాన్ని పేర్కొనడంలో గల ఉద్దేశం ఏమిటంటే, నీవు ఈ జనుల సమక్షంలో ధర్మానికి సంబంధించిన రాచబాటను చూపిస్తున్నావు. ఈ మూఢులేమో ఈ వరప్రసాదానికి విలువనివ్వడం పోయి దానికి భిన్నంగా ఆగ్రహిస్తున్నారు. కాని వీరిలోనే, వీరి జాతి ప్రజలే కొందరున్నారు, వారు అల్లాహ్ వైపునకు మొగ్గుతున్నారు, అల్లాహ్ కూడా వారిని తన వైపునకు ఆకర్షించి తీసుకువస్తున్నాడు. ఇక ఇది ఆయా వ్యక్తుల అదృష్టం. ఒకరు ఈ వరప్రసాదాన్ని పొందుతూ ఉంటే మరొకరు దానికి అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అయితే అల్లాహ్ చేసే పంపిణి గుడ్డివాని పంపిణి కాదు. తన వైపునకు ముందుకు వచ్చిన వారినే ఆయన ఆకర్షిస్తాడు. దూరంగా పారిపోయే వారి వెంట పడటం అల్లాహ్ పద్ధతి కాదు.

22. అంటే విభేదానికి మూలం, దైవం ప్రవక్తల్ని పంపకపోవడం కాదు, గ్రంథాలను అవతరింపజేయక పోవడమూ కాదు; ఈ కారణంగానే జనులు, రుజుమార్గం తెలియకపోవడం చేత తమ తమ మతాలు, చింతనా పథాలు, జీవన మార్గాలు స్వయంగా సృష్టించుకుకూర్చోలేదు. వాస్తవానికి ఈ విభేదాలు, అల్లాహ్ వద్ద నుండి జ్ఞానం వచ్చిన తరువాత వారిలో పొడసూపాయి. అందువల్ల దానికి బాధ్యుడు అల్లాహ్ కాదు, వారే దానికి బాధ్యులు, ఎందుకంటే స్వయంగా వారే ధర్మంలోని స్పష్టమయిన సూత్రాలను, షరీఅత్‌లోని విశదమయిన ఆదేశాలను ప్రక్కకు నెట్టి కొంగ్రొత్త మతాలు, పంథాలు నిర్మించుకున్నారు.

23. అంటే, ఈ విభేదాలకు మూలం ఏదో సద్బుద్ధి కాదు. నిజానికి ఏదో కొత్తదనం చూపించాలన్న ఉబలాటం, తమ జెండా వేరుగా ఉండాలన్న ఆకాంక్ష, ఒకరి మీద మరొకరి మొండిపట్టు, ఒకరినొకరు కించపరచాలన్న తాపత్రయం, ధనం పదవుల కాంక్షకు పర్యవసానమే ఇదంతా. యుక్తిపరులు, సాహసోపేతులయినవారు గమనించారు, దేవుని దాసులయిన మానవులు సాదాసీదాగా దైవధర్మాన్ని అనుసరిస్తూ ఉన్నట్లయితే ఒక్క దైవం సమక్షంలోనే జనులంతా మోకరిల్లేవారు. ఒక్క ప్రవక్తనే జనులు తమ గురువుగా, మార్గదర్శిగా స్వీకరించేవారు. ఒక్క గ్రంథాన్నే జనం నమ్మి దాని వైపునకే మరలేవారు. ఒక స్పష్టమయిన విశ్వాసం, ఒక నిర్దుష్టమయిన నిష్పక్షపాతమయిన నియమావళినే అందరూ అనుసరించేవారు. ఈ ధార్మిక వ్యవస్థలో వారికి తమదంటూ ఏ స్థానం, ఏ ప్రత్యేకతా లేదు. తమ పెద్దరికం చెలామణి అయ్యే, జనం తమ చుట్టూ ప్రోగయ్యే, తలలూ వంచి, జేబులూ ఖాళీచేసే అవకాశమే లేదు. అసలు కారణం ఇదే. దీని మూలంగానే కొంగ్రొత్త విశ్వాసాలు, తత్వాలు, సరికొత్త ఆరాధనా విధానాలు, మతాచారాలు, నవీన జీవన వ్యవస్థలు కనుగొనడానికి ప్రేరణ కలిగింది. దీనివల్లనే మానవాళిలో అధికాంశం ధర్మం చూపిన రాచబాట నుండి తొలగి విభిన్న దారుల్లో విచ్ఛిన్నమయిపోయింది. ఈ విచ్ఛిన్నత, ఈ వర్గాల పరస్పర వాదులాటలకు, పోరాటాలకు, మత, ఆర్థిక రాజకీయ సంఘర్షణలకు దారితీసి వీటి మూలంగా తీవ్రమయిన వెగటు అనుభవాలలోకి పరివర్తించింది. కడకు రక్తపాతాల వరకు పరిణమించింది. దాని మచ్చల కారణంగానే మానవ చరిత్ర యావత్తూ రక్తసిక్తమయి కానవస్తుంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**300)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ప్రసంగిస్తూ ఇలా అన్నారు– "అల్లాహ్ తన దాసుల్లో ఒకనికి ప్రపంచంలో మరియు పరలోకంలో ఉన్న దానిలో (వస్తు సామగ్రిలో) ఏదో ఒక దానిని ఎన్నుకునే స్వేచ్ఛను ఇవ్వగా ఆ దాసుడు అల్లాహ్ వద్దనున్న దానిని ఎంపిక చేసుకున్నాడు." ఇది వినగానే అబూబక్ర్(రజి) ఎక్కి ఎక్కి ఏడ్వసాగారు. అబూ సయీద్ ఇలా అన్నారు: ఆయన ఏడుపుపై మాకు ఆశ్చర్యమేసింది. దైవప్రవక్త(స) ఎంపిక స్వేచ్ఛ నివ్వబడిన ఒకానొక దాసుని గురించి చెబుతుండగా ఈయన గారు ఎందుకు ఏడుస్తున్నారని మేము ఆశ్చర్యపోయాము. కాని అసలు విషయం ఏమిటంటే; ఆ దాసుడు ఎవరో కాదు, దైవప్రవక్తే(స). యథార్థానికి అబూబక్ర్(రజి) మాలో అందరి కన్నా గొప్ప జ్ఞాని. దైవప్రవక్త(స) ఒక సందర్భంగా ఇలా అన్నారు: "సహచర్యం రీత్యాగాని, సంపద దృష్ట్యా గానీ నా మీద అబూబక్ర్(రజి) ఉపకారం అందరికన్నా ఎక్కువ. ఒకవేళ నేను గనక నా ప్రభువు తప్ప వేరితరుల్లో ఎవరినయినా నా ప్రాణ స్నేహితునిగా చేసుకోవలసి వస్తే అబూబక్ర్‌నే చేసుకునే వాణ్ణి. అయితే ఇస్లాంలోని సౌభ్రాతృత్వం, ఇస్లాం ప్రేమ ఆయన పట్ల ఉంది. చూడండి! (సహాబా ఇండ్ల వైపునకు తెరచుకునే) మస్జిద్ ద్వారాలన్నింటినీ మూసివేయండి. కేవలం ఒక్క అబూబక్ర్ ద్వారాన్ని మాత్రమే తెరచి ఉంచండి."

**302)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఒకవేళ నేనే గనక నా అనుచర సమాజం (ఉమ్మత్)లోని ఏ వ్యక్తినయినా నా ప్రాణ స్నేహితునిగా చేసుకోవలసివస్తే అబూబక్ర్‌ను చేసుకునేవాణ్ణి. కాని ఆయన నా ధార్మిక సోదరుడు, నా స్నేహితుడు."

**306)** ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్‌యిమ్ గారికి ఆయన తండ్రి తెలిపిన దాని ప్రకారం ఒక స్త్రీ దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చింది (సహాయార్థం). "తరువాత రా అమ్మా" అని ఆయన(స) ఆమెకు చెప్పారు. దానికి ఆమె, 'సరే. తరువాత వస్తాను. కాని అప్పుడు తమరు లేకపోతే ఎలా?' అని ప్రశ్నించింది. అంటే ఒకవేళ మీకు మరణం సంభవిస్తే అప్పుడు ఎవరిని అడగాలి? అని ఆమె చెప్పదలిచింది. దానికి ఆయన(స) "అప్పుడు నేను గనక లేకుంటే నీవు అబూబక్ర్ వద్దకు వెళ్ళవచ్చు"[1] అన్నారు.

306-1. ఈ హదీసు ద్వారా అవగతమయ్యే ఒక విషయం ఏమిటంటే, తన తదనంతరం అబూబక్ర్ (రజి) ఖలీఫా అవుతారన్న సంగతి ఆయన(స)కు 'వహీ' ద్వారా తెలిసిపోయింది. తిబ్రానీలోని వేరొక హదీసు ప్రకారం, 'దైవప్రవక్తా! మీ తదనంతరం మేము జకాత్ సొమ్మును ఎవరికి ఇవ్వాలి?' అని కొందరు ప్రశ్నించగా "అబూ బక్ర్‌కు ఇవ్వండి" అని ఆయన (స) చెప్పారు. కాని ఈ హదీసు సనదు బలహీనంగా ఉంది. మరో ఉల్లేఖనం ప్రకారం ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త(స) సమక్షంలో ప్రమాణబద్ధుడైన తరువాత, 'ఒకవేళ తమరు మరణిస్తే నేను ఎవరి దగ్గరకు రావాలి?' అని అడిగాడు. దానికి ఆయన(స), "అబూబక్ర్ దగ్గరకు" అని బదులిచ్చారు. 'ఆయన తరువాత ఎవరి దగ్గరకు రావాలి?' అని తిరిగి ప్రశ్నించగా, "ఉమర్ దగ్గరకు" అని చెప్పారు.

★★★



# గాఢాంధకారం

## (ఇస్లామ్ ప్రవక్త ప్రభవించే నాటికి ప్రపంచ ఆధ్యాత్మిక, నైతిక పరిస్థితి)

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**ప్రపంచంలోని** ప్రతి వస్తువు వాస్తవికత దానికి వ్యతిరేకంగా ఉన్నదాంతోనే గుర్తించబడుతుందని అంటారు. ఒకవేళ ఇదే నిజమైతే, గ్రీష్మతాపంతో ఉడికిపోయిన మీదటే వానజల్లు ఆహ్లాద కరంగా ఉంటుంది. దట్టమైన చీకటిలోనే వెలుతురు విలువ తెలిసివస్తుంది. బయట అంధకారం ఎంత గాఢంగా అలుము కుని ఉంటే ఉరుముల మెరుపులు అంతే ప్రకాశమానంగా కనిపిస్తాయి. కాబట్టి ఏ సంస్కరణాత్మక ఉద్యమం గొప్పదనా న్నయినా గ్రహించాలంటే, ఆనాటి ప్రపంచ స్థితిగతులను తరచి చూడాలి. అది ఎంతగా మార్గభ్రష్టమై ఉందో, సంస్కరణకు మానవత ఎంత ఆశతో అర్రులు చాచిందో చూడాలి. దాని కొరకు ఒక గొప్ప ప్రవక్త ఆపన్న హస్తం ఎంత అవసరం, మరి ఆ ప్రవక్తకు దేవుని అభయహస్తం ఎంతగా అవసరమై ఉండిందో కూడా చూడాలి –

> **ఎవరయితే (నీ చేతిలో చెయ్యేసి) విధేయతా ప్రమాణం చేస్తున్నారో వారు యథార్థానికి అల్లాహ్‌తో ప్రమాణం చేస్తు న్నారు. వారి చేతులపై అల్లాహ్ చెయ్యి వుంది.**
>
> ***(అల్ ఫత్‌హ్ : 10)***

ఇస్లాం లేదా దైవప్రవక్త ముహమ్మద్ (స) సందేశం, ప్రబోధనల గురించి మేము చెప్పేదొక్కటే– అది ప్రపంచంలోని అద్భుత మయిన ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక సందేశం. దీని ఆధారంగా మనం, ఆనాడు ప్రపంచ పరిస్థితి ఎలా ఉండేది? అనేది చూడాలి. ఆనాడు ప్రపంచంలో ఒక భూభాగం ఉండేదనీ, దానిపై సూర్యకిరణాలే అసలు ప్రసరించేవి కావని అంటే అది అక్షరాలా నిజం అన్నమాట. యావత్ప్రపంచంలో సిసలైన విశ్వా సాల ఉనికి అన్నదే లేదు. ఏకేశ్వరోపాసనా కాంతికి ప్రపంచం లోని అణువణువూ దూరమై ఉండేది. నాగరికంగా ఉచ్చ స్థితిలో ఉన్న రోము, గ్రీకు, ఈజిప్టులలో సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు దేవుళ్ళుగా వర్ధిల్లేవి. వాటి దేవాలయాలుండేవి. వాటి పేరు మీదే నరబలి, పశువుల బలిదానం ఇవ్వబడేది. ఎల్లెడలా రాతి విగ్రహాలు, మట్టి బొమ్మలు ఉండేవి. బంగారు, వెండి, వజ్రాలతో చేయబడిన విగ్రహాల పూజ చేసేవారు.

ఆనాడు ప్రపంచంలో ముగ్గురు నైతికోపాధ్యాయులుండేవారు – విగ్రహ పూజారులు, క్రైస్తవులు, బౌద్ధులు. ఈ మూడు మతావ లంబీకులు కూడా బ్రహ్మచర్యం, సన్యాసత్వం, బైరాగితనానికి లోనై, భవబంధాలను త్రెంచుకునేవారు. తత్కారణంగా ప్రపంచ ప్రగతిశీలక హస్తం చచ్చుబడిపోయింది. వారు పుణ్యం కోసం ఎంత కఠోరమైన తపస్సులకు, అభ్యాసాలకు పూనుకునేవారంటే, నేడు వాటిని గురించి వింటేనే ఒళ్ళు జలదరిస్తుంది.

ఏసుక్రీస్తు (ఈసా–అలైహిస్సలాం) ఆరు శతాబ్దులకు పూర్వం ఆత్మశుద్ధికి సంబంధించిన పాఠాలు నేర్పిన సంగతి నిజమే. కాని ప్రపంచం ఆ పాఠాలు చాలా కాలం క్రితమే మరచి పోయింది. దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) అంతకన్నా

ముందే సన్మార్గ జ్యోతిని వెలిగించిన విషయం కూడా వాస్తవమే. కాని ఉపద్రవాల, సంక్షోభాల పెనుగాలికి తూరు కొండపై వెలిగిన ఆ దీపం కూడా ఆరిపోయింది. జర్‌దష్ట్ (పారసీక మతస్థాపకుడు) కూడా ఆధ్యాత్మిక అగ్నిని రాజేశాడు. కాని ఆ జ్వాల కూడా మానవ రక్తపు మరకలతో ఆరిపోయి, చల్లబడిపోయింది. అంతకు ముందు గౌతమబుద్ధుడు ఆర్యావర్త పర్వతాలపైన, పర్వత గుహలలోన మనశ్శాంతిని శోధించి సాధించిన సంగతి కూడా నిజమే. కాని సంఘటనల తుఫానులో ఆ పర్వతాల జాడ కొట్టుకుపోయింది. ఆ కొండ గుహలు కూడా క్రూరమృగాల ఆశ్రయాలుగా మారిపోయాయి. ప్రతి జాతిని మరో జాతి అణగదొక్కే ప్రయత్నం చేసింది. ప్రతి తెగ మరో తెగ పట్ల రక్తపిపాసిగా తయారయింది. సర్వత్రా పేరాశ, స్వార్థం, రక్తపాతాల వాతావరణం నెలకొని ఉండేది. తుచ్ఛమయిన భావాల క్షుద్రదేవత ముందు మానవాత్మ గజగజా వణికిపోయింది. న్యాయం, ధర్మం, సౌశీల్యం, పవిత్రతల సుగంధ పరిమళం మానవ సముదాయాల నుండి పలాయనం చిత్తగించింది. ఏకేశ్వరోపాసన, దైవదాస్యపు కాంతి దేవీదేవతల, నక్షత్ర పూజల, ఇలవేల్పుల, విగ్రహ పూజల అంధకారంలో మాయమైపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి ప్రపంచం ఒక గొప్ప సంస్కర్త, నీతి బోధకుడు, సత్య సందేశ ప్రదాత, మానవ జాతికి మోక్షం ప్రసాదించే కట్టకడపటి ప్రవక్త రావాలని, చెల్లాచెదురుగా ఉన్న మానవ వర్గాలను ఏకత్రాటిపై తీసుకురావాలని ఆశతో ఎదురు చూడసాగింది.

– ఇదీ క్లుప్తంగా ఆనాటి ప్రపంచ పరిస్థితి. వివరాల కోసం మనం ఒక్కొక్క జాతిని, అది అవలంబించే మతధర్మాన్ని తరచి చూడవలసి ఉంటుంది.

## ఇస్లాం ఆవిర్భవించినప్పుడు, ప్రపంచ మత, సాంస్కృతిక పరిస్థితి ఎలా ఉండేది?

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రభవించేనాటికి గ్రీకు, ఈజిప్టు, కల్దానియా, బాబిలోనియాల సాంస్కృతిక వైభవం విలసిత గాథగా మారిపోయింది. స్వయంగా అరేబియాలోనూ, దాని పరిసర ప్రాంతాలలోనూ ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిపోయిన ప్రభుత్వాలు– ఉదాహరణకు– నాబతీ, హుమైరీ, సబాయీ ప్రభుత్వాలు చాలా కాలం క్రితమే అంతమైపోయాయి.

ఈ సందర్భంగా చూడాల్సిందొక్కటే – శుభోదయ కిరణాలు ప్రసరించే ఆ శుభవేళ ప్రపంచంలో ఏ ఏ జాతులు అధికారంలో ఉన్నాయి? అవి అవలంబించే మతాలేవి? నైతికంగా వాటి పరిస్థితి ఎలా ఉండేది? ప్రపంచ మతాలు ఆనాటి తమ ఆధ్యాత్మిక పరిస్థితులను నిలుపుకోవడానికి ఏ మేరకు శక్తి కలిగి ఉండేవి? అన్నది చూడదగినది. ఆనాడు భూమండలంలో తిరుగులేని శక్తులు రెండే రెండు ఉండేవి. పారసీకుల మతం మజూసీ మతం. దాని పరిధి ఇరాక్ మొదలుకుని భారత సరిహద్దుల వరకు విస్తరించి ఉండేది. రోము సామ్రాజ్య మతం క్రైస్తవం. అది ఐరోపా, ఆసియా, ఆఫ్రికా ఖండాలను పరివేష్టించి ఉండేది. అయితే మతపరంగా మరో రెండు జాతులు కూడా ఇక్కడ ప్రస్తావించదగినవే. వాటిలో ప్రతి ఒక్కటీ సనాతన మత ధర్మం తనదేనని వాదించేది. వారిలో ఒకరు యూదులు, రెండవ వారు హైందవులు.

## పారసీక మజూసీలు

అరేబియా ద్వీపానికి పొరుగునే ఉన్న సామ్రాజ్యం పారసీక సామ్రాజ్యం. దాని సంస్కృతీ నాగరికతల వైభవం ఒక కాలంలో ఉచ్ఛస్థితిలో ఉండేది. కాని దైవప్రవక్త (స) ప్రభవనానికి వందేళ్ళ క్రితం నుండే సాసానీల, కియానీల వైభవం మసకబారిపోయింది. నిరంతర తిరుగుబాట్లు, అంతర్యుద్ధాలు, రాజకీయ సంక్షోభాల కారణంగా దాని అధికార పునాదులు కదిలిపోయాయి. ఒక వైపు నుంచి రాజుల అమానుష పోకడలు, మరో వైపు నుంచి అధికారుల, శ్రీమంతుల భోగలాలస జీవితం, ఇంకోవైపు నుంచి స్వార్థపరుల దోపిడీ విధానాలు – వెరసి నిజాయితీ తత్పరతను, నైతిక ఆభరణాన్ని నాశనం చేసేశాయి.

బాబిలోనియా నాగరికతా ప్రభావం వల్ల ఈరాన్‌లో నక్షత్ర పూజ సర్వసామాన్యమై ఉండేది. అందుకే పారసీక సాహిత్యంలో ఖగోళం, నక్షత్రాల పని తీరు చాలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇలాంటి అంధకారంలో జర్‌దష్ట్ తన అగ్నిని రాజేశాడు. వెలుగు– చీకట్లు లేదా మంచీ– చెడుల ఇద్దరు దేవుళ్ళు ఉనికిలోనికి వచ్చారు. అగ్ని అతని సాష్టాంగ ప్రణామాలకు కేంద్ర బిందువు అయింది. ఇస్లాంకు కొన్ని శతాబ్దులకు పూర్వం మానీ క్రైస్తవాన్ని, మజూసీ మతాన్ని మేళవించి ఓ సరికొత్త జీవన పద్ధతిని రూపొందించాడు. వెలుగు చీకట్ల గురించి అతను ప్రచారం చేసిన భావజాలం నుండి ఆ జాతి జనులు సుదీర్ఘకాలం వరకు బయటపడలేక సతమతమయ్యారు. ప్రజా బాహుళ్యాన్ని ప్రపంచానికి దూరం చేసి, భవబంధాలను త్రెంచి వేసి, వైరాగ్యాన్ని ప్రేరేపించి మానవ సంతతి పరంపరను అంతమొందిస్తేగాని లోకంలో చెడు నిర్మూలించబడదు అన్నది అతని ఫిలాసఫీ. ఇక నైతికంగా చూస్తే లోకోభిన్న రుచి ఉండేది. తండ్రి తన కన్న కూతురిని, సోదరుడు తన తోబుట్టువును తన దాంపత్య జీవితంలోకి తీసుకోవటం అక్కడ అసాధారణ చర్య ఏమీ కాదు. క్రీ.శ. 5వ శతాబ్ది మధ్యలో అక్కడి రాజ్యాధిపతిగా ఉన్న రెండవ యజ్దిగర్ద్ సాక్షాత్తూ తన కన్నకూతురిని వివాహమాడాడు. తరువాత ఆమెను హతమార్చాడు. ఆ

సమాజంలో స్త్రీ జాతి తోటి పురుషుని ఒడిలో ఒక ఆటబొమ్మగా, విలాస వస్తువుగా మాత్రమే ఉండేదని అలనాటి పారసీక సాహిత్యం చెప్పకనే చెబుతుంది. ఇక స్త్రీల విశ్వాస ఘాతుకం, దుర్నడత, వారిపై పురుషులకు గల అప నమ్మకం అనేది పారసీక సంస్కృతిలో అన్నిటికన్నా పెద్ద భాగం అంటే అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు.

చక్రవర్తులు, అధికారులు క్రమేణా ప్రజల దేవుళ్ళుగా తయారయ్యే వారు. ప్రజలు వారికి ప్రణమిల్లేవారు. వారిని దేవుళ్ళుగా కీర్తించే వారు. వారి దర్బారులో ఒక సామాన్యుడు కూర్చోలేడు. వారికి వ్యతిరేకంగా ఎవడూ నోరు విప్పలేడు. వారు ఎంత పెద్ద నేరం చేసినా శిక్షలుండవు. వారి దౌర్జన్యాలను సామాన్య ప్రజలు కిమ్మనకుండా సహించాల్సిందే.

రాజ్యంలోని ఓ పెద్ద వర్గం రోమను క్రైస్తవుల అంతులేని యుద్ధాల వల్ల విసుగెత్తిపోయింది. చర్చీలకు – అగ్ని ప్రార్థనాలయాలకు మధ్య ఎడతెగని వైరం నెలకొని ఉండేది. రోమనులు విజయం సాధించినప్పుడు అగ్ని మండపాలు కూలిపోయి చర్చీలు వెలిసేవి. పారసీకులు గెలిచినప్పుడు చర్చీలు కూలిపోయి అగ్ని దేవతల ఆలయాలు వెలిసేవి. యూదులపై జరిగే దౌర్జన్యాల గురించి తెలుసుకోవాలంటే బైబిల్ పాతనిబంధన చదవాల్సిందే. పిదప యూదులు ప్రాబల్యం వహించినప్పుడు వారు క్రైస్తవులపై సాగించిన మారణహోమం కూడా తక్కువేమీ కాదు.

అంతిమ దైవప్రవక్త (స) ప్రభవనానికి పూర్వం పారసీక సామ్రాజ్యం ఆటుపోటులకు గురవసాగింది. ఒకవైపు విదేశీ దండయాత్రలు, మరోవైపు అంతర్గత సమస్యలతో రాజ్య వ్యవస్థ అతలాకుతల మవసాగింది. చివరికి ప్రజలు రాజ్యపాలకుడు ఖబ్బార్‌ను నిర్బంధించారు. అతను కారాగారం నుంచి ఎలాగో తప్పించుకుని పరారై తాతారీల శరణుకోరాడు. తాతారీల తోడ్పాటుతో రెండుసార్లు అధికార పీఠాన్ని దక్కించుకోగలిగాడు. కాని అతని హయాంలో అంతకన్నా పెద్ద ఆపదే ఒకటి విరుచుకు పడింది–మజ్దక్ అనే ఒక వ్యక్తి అక్కడ పుట్టుకొచ్చాడు. ధనం, స్త్రీ–ఇవి రెండూ ఏ ఒక్క వ్యక్తీ సొత్తు కాదని, అవి యావత్ సంఘం ఉమ్మడి ఆస్తి కావాలని అతడు పిలుపు ఇచ్చాడు. అంటే మజ్దక్ నూరిపోసిన విశ్వాసాల ప్రకారం ఒక వ్యక్తి భార్య, అతనికి భార్యగా ఉంటూనే ప్రతి పురుషునితో కులకగలదు. విషయ లోలురైన శ్రీమంతులు, సామాన్య ప్రజలు చాలా సంతోషంగా ఈ భావజాలానికి నీరాజనం పట్టారు. ఈ మతం చాలా తొందరగానే ఏలిన వారి ఆశీర్వాదంతో పురోగమించింది. ఖబ్బాద్ ఖుద్దుగా ఈ మతవ్యాప్తిలో కీలక పాత్ర వహించాడు. జాతి నీతి నడవడికలపై దాని ప్రభావం ఎలా పడుతుందో తెలిసిందే. యావద్దేశం భోగలాలసత్వం, కామ దాహపు మత్తులో జోగసాగింది.

క్రీ.శ. 531లో ఖబ్బాద్ స్థానంలో నౌషేర్వా వచ్చాడు. అతని న్యాయవర్తనం గురించి ఈరాన్‌లో ఇప్పటికీ చెప్పుకుంటారు. కాని అతనికి న్యాయవర్తనుడన్న బిరుదు లభించిందెప్పుడు? తన సమీప బంధువుల్ని, వేలాదిమంది అమాయకులను చంపిన తరువాత! అతను మజ్దక్ ఉపద్రవాన్ని ఖడ్గ బలంతో అణచివేయా లను కున్నాడు. కాని అతని కుమారుడు నౌషజ్ రావ్ స్వయంగా 'త్రిత్వం' వైపు మొగ్గు చూపాడు. ఈ నేరానికి గాను అతను బంధించబడ్డాడు. అయితే బందీఖానా నుండి పారిపోయి, క్రైస్తవ సైన్యాన్ని సమీకరించి జర్‌దష్తీలతో కుమ్మక్కు అయ్యాడు. చివరకు హతమార్చబడ్డాడు.

క్రీ.శ. 579లో నౌషేర్వా మరణించడంతో, ఈరాన్ సింహాసనం నాల్గవ హర్మూజ్ కైవసం అయింది. విదేశీ జోక్యంతో పాటు, ఆంతరంగిక వ్యవహారాల్లో అవసవ్యత, పరస్పర కుమ్ములాటలు, రాజుల ఏమరుపాటు, ధనవంతుల భోగప్రియత్వం, సామాన్య ప్రజల నైతిక అధోగతి అనుదినం పెరుగుతూ పోయింది. చివరకు క్రీ.శ. 636లో ఇస్లామీయ యోధుల విజయంతో పారసీక సామ్రాజ్యపు మిణుకు మిణుకుమంటున్న దీపం కాస్తా శాశ్వతంగా ఆరిపోయింది.

ఈ వివరాల ద్వారా విదితమయ్యేదేమంటే, ఈరాన్ భూభాగంలో ఏకేశ్వరోపాసనా గీతం ఎప్పుడూ ఆలపించబడలేదు. నైతికతకు సంబంధించిన ఎన్నో అధ్యాయాలు పారసీకుల సంవిధానంలో చేర్చబడలేదు. ఆస్తిక – నాస్తిక, వెలుగు – చీకటి, మంచీ – చెడుల విచక్షణను పాటించటంలో వారి వల్ల జరిగిన అలసత్వం వారిని సతతం మతిమాలిన తనానికి గురిచేసింది. రాజరికం అనేది వారి దృష్టిలో దైవత్వంతో సమానంగా ఉండేది. ముస్లిం లకు – పారసీకులకు మధ్య యుద్ధాలు జరిగినప్పుడు ముగీరా బిన్ షూబ ముస్లింల దూతగా ఈరాన్ సైన్యాధిపతి దర్బారుకు వెళ్ళారు. యధేచ్ఛగా దర్బారులోనికి వెళ్ళి అతని సరసన కూర్చునే సరికి ఆస్థాన ప్రముఖులకు దిమ్మతిరిగినంత పనయింది. దానిని వారు తమ సైన్యాధిపతికి అవమానకరంగా భావించి, ముగీరాను అక్కడి నుంచి లేపేశారు. ముగీరా వారికి సమాధానమిస్తూ, "ప్రజల సమక్షంలో ఒక దేవునిలా కూర్చోవటం, ఇతరులు అతని ముందు బానిసల్లా నిలబడటం అరబ్బులమైన మా సంప్రదాయం కాద"న్నారు.

మహాప్రవక్త (స) ప్రభవనానికి నూట యాభై సంవత్సరాలకు పూర్వం నుండే ఈరాన్‌లో రాజకీయ పతనం మొదలైంది. అది రాను రాను ఉధృతమయింది. పారసీకుల అగ్ని పూజ జరిగే ఆలయాలలో ఆధ్యాత్మికతే లేకుండా పోయింది. అందుకే ఇస్లాం కాంతి కిరణాలు ప్రసరించినప్పుడు, వాటిని ఆపగలిగే మరో అడ్డు తెర ఏదీ లేకుండా పోయింది.

*(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)*

**(మిగతా వచ్చే సంచికలో)**



# పత్రికా స్వేచ్ఛపై క్రూరమైన దాడి

ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు అందరిపై వరుసగా దాడులు జరిగాయి. కేవలం ఐదు రోజుల వ్యవధిలో అనేకమందిపై దాడులు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే వివిధ సంస్థలు ఈ దాడులు చేశాయి. అక్టోబర్ మొదటి వారంలో మూడు కేంద్రప్రభుత్వ నిఘా సంస్థలు, పోలీసు విభాగానికి చెందిన ఒక సంస్థ దేశంలోని 200 ప్రాంతాల్లో తనిఖీలు, విచారణలు జరిపారు. ఈ దాడులన్నీ ఒకే మాదిరిగా ఉన్నాయి. దాడులన్నీ తెల్లవారుజామున జరిగాయి. ఈ దాడుల గురించి ప్రధాన స్రవంతి మీడియాలో లీకయ్యింది. నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని విమర్శించే వారిపైనే ఈ దాడులన్నీ జరిగాయి. మానవ హక్కుల కార్యకర్తలు, పాత్రికేయులు, రచయితలు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, ఒక రాష్ట్ర మంత్రి, బీజేపీని వ్యతిరేకించే పార్టీల నాయకుల ఇండ్లపై దాడులు జరిగాయి. అక్టోబర్ 2వ తేదీన నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజన్సీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 62 చోట్ల దాడులు చేసింది. ఇది ముంచింగిపుట్టు కేసుకు సంబంధించిన దాడులు. మావోయిస్టుల కదలికల గురించిన కేసు. అక్టోబర్ 3వ తేదీన న్యూస్ క్లిక్ వెబ్ సైటుకు చెందిన 46 మంది జర్నలిస్టులు, వ్యాఖ్యాతల ఇండ్లపై దాడులు జరిగాయి. న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థను అరెస్టు చేశారు. అక్టోబర్ 4వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆమ్‌ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఇంటిపై దాడి చేసింది. ఆయన్ను అరెస్టు చేశారు. లిక్కర్ స్కాములో ఆయన్ను అరెస్టు చేశారు. అక్టోబర్ 5వ తేదీన ఆదాయ పన్ను శాఖ డిఎంకే ఎంపీ జగదరక్షకన్‌కు సంబంధం ఉన్న 40 ప్రదేశాలపై తనిఖీలు చేసింది. నిజానికి ఇప్పుడు దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడినట్లు కనిపిస్తుంది. టెర్రరిస్టు కేసులు పెట్టే ఉపా చట్టం క్రింద జర్నలిస్టులను అరెస్టు చేశారు. 'ది వైర్' వార్తా సంస్థ ప్రకారం 16 మంది జర్నలిస్టులను ఉపా చట్టం క్రింద అరెస్టు చేశారు. ఇందులో ఏడుగురు ఇప్పుడు నిర్బంధంలో ఉన్నారు. ఈ చట్టం ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించడానికి చేసిన చట్టం. ఇప్పుడు జర్నలిస్టులను భయపెట్టడానికి, టెర్రరిస్టులుగా ముద్ర వేయడానికి దీనిని ఉపయోగిస్తున్నారు. తాజా ఉదాహరణ ప్రబీర్ పురకాయస్థ అరెస్టు. ఆయన న్యూస్ క్లిక్ ఎడిటర్. ఆయన్ను ఉపా క్రింద అరెస్టు చేశారు. ఈ చట్టాన్ని న్యాయవాదులు, విద్యార్థులు, కార్మికులు, ఆదివాసీలు, మానవ హక్కుల కార్యకర్తలపై విచక్షణ లేకుండా ఉపయోగిస్తున్నారు. ది వైర్ వార్తా సంస్థ ప్రకారం 2010 నుంచి 2020 మధ్య కాలంలో 154 మంది జర్నలిస్టులను దేశంలో అరెస్టు చేయడమో, నిర్బంధించ డమో, ప్రశ్నించడమో, షోకాజ్ నోటీసులు ఇవ్వడమో జరిగింది. జర్నలిస్టులకు వ్యతిరేకంగా టెర్రరిస్టు ఉపా చట్టం ప్రయోగించడం ప్రజాస్వామిక విలువలను అణిచేయడమేనని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విధంగా ప్రజలకు సమాచారాన్ని తెలుసుకునే హక్కు లేకుండా చేస్తున్నారని కొందరు నిరసిస్తున్నారు. ●




**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ**

## (గత సంచిక తరువాయి)

### 4) వారి వీపు వెనకాల వారి కోసం దుఆ చేయడం

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “తన ముందర లేని తన సోదరుడి కోసం ఒక ముస్లిం చేసిన దుఆ స్వీకరించబడుతుంది. అతనిపై ఒక ప్రతినిధి దైవదూత ఉంటాడు. అతను తన సోదరుడి మంచి కోసం ప్రార్థించినప్పుడల్లా, ప్రతినిధి దైవ దూత ఆమీన్ అంటాడు. మరియు నీ కోసం కూడా అని దీవిస్తాడు”. (ముస్లిం)

### 5) పండితుల సలహా

ఇమామ్ నవవి (రహ్మ) ఇలా అభిప్రాయపడ్డారు: “బంధుత్వ సంబంధాలను నిలబెట్టడం అనేది వ్యక్తినిబట్టి ఉండాలి - కొన్నిసార్లు దయగా ఉండటం. కొన్నిసార్లు ధన సహాయం ద్వారా, కొన్నిసార్లు సేవ ద్వారా, కొన్నిసార్లు సందర్శించడం ద్వారా, ఏవైనా శుభ సందర్భాలు ఉంటే శుభాకాంక్షలు తెలుపడం ద్వారా”.

ఇమామ్ ఖుర్తుబీ ఇలా అభిప్రాయం పడ్డారు : బలపర్చాల్సిన సంబంధాలు రెండు విధాలు. సాధారణమైనవి, నిర్దిష్టమైనవి, **1) సాధారణమైన బంధం :** ఎదుటి వ్యక్తి శ్రేయాన్ని కోరుకోవడం, పరస్పర ప్రేమాభిమానాలు కలిగి ఉండటం. సలహా, సంప్రతింపులు జరపడం. అందరి యెడల న్యాయంగా వ్యవహరించడం, సిఫార్సు చేయడం, ఇతరుల హక్కులను నెరవేర్చడం ద్వారా కొనసాగించాలి.

**2) నిర్దిష్టమైన బంధం :** ఆర్థికంగా వారిని ఆదుకోవడం, వారి స్థితిగతులను, మంచీచెబ్బరలను అడిగి తెలుసుకోవడం, వారి పొరపాట్లను, తప్పులను పెద్ద మనసుతో క్షమించడం.

**షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మ) ఇలా అన్నారు :** ఫోన్ ద్వారా యోగక్షేమాలు తెలుసుకోవడం కూడా బంధుత్వ సంబంధాలను నిలబెట్టుకోవడంలో భాగమే. వీడియో కాలింగ్, చాటింగ్, మెసేజ్ అన్నీ బంధాలను బలపరచడమే అవుతుంది.

### 6) మంచిని గురించి ఆదేశించడం

“మన్ దల్ల అలా ఖైరిన్ ఫలహు క అజ్రి ఫాయిలిహి”- మంచికి మార్గం చూపిన వ్యక్తికి మంచి చేసే వ్యక్తికి లభించినంత పుణ్యం లభిస్తుంది అన్నారు మహనీయ ముహమ్మద్ (స). (ముస్లిం)

మంచి చేయడానికి మనం పండితులం కానవసరం లేదు. మంచి మనసున్న మనుషులమయితే చాలు. నిజంగా మంచి చేయాలన్న సద్బుద్ధి కలగడమే గొప్ప విషయం. కాబట్టి అలాంటి గొప్ప ఆలోచన వచ్చినప్పుడు గోరంత ఆలస్యం కొండంత నష్టానికి దారి తీయగలదన్న స్పృహతో మంచి చేసెయ్యాలి.

## 7) చెడును గురించి వారించడం

హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం : "(ప్రవక్తా!) నీ దగ్గరి బంధువులను భయపెట్టు" అన్న దివ్య ఖుర్‌ఆన్ సూక్తి (అష్ షుఅరా : 214) అవతరించినప్పుడు దైవప్రవక్త(స) ఖురైషులందరినీ పిలిచారు. దాంతో (ఖురైష్ తెగకు చెందిన) సామాన్యులు, ప్రముఖులందరూ ఒకచోట సమావేశమయ్యారు. అప్పుడు ఆయన తన తెగవారికి దైవ సందేశాన్ని అందజేస్తూ ఇలా అన్నారు-

"ఓ అబ్ద్ షమ్స్ వంశీయులారా! ఓ కాబ్ లుఅయ్యి వంశీయులారా! మిమ్మల్ని మీరు నరకాగ్ని బారినుండి కాపాడుకోండి. హాషిం వంశీయులారా! మిమ్మల్ని మీరు నరకాగ్ని బారినుండి కాపాడుకోండి. అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులారా! మిమ్మల్ని మీరు నరకాగ్ని బారినుండి రక్షించుకోండి. ఓ ఫాతిమా! నిన్ను నీవు నరక జ్వాలల నుంచి కాపాడుకో. ఎందుకంటే దైవశిక్ష నుండి మిమ్మల్ని కాపాడటానికి నాకు ఎలాంటి అధికారం లేదు. అయితే మీకు నాతో బంధుత్వం ఉంది కనుక (ఇహలోకంలో ఉన్నంతకాలం) బంధుత్వ సంబంధాలను మాత్రం కొనసాగిస్తాను." (ముస్లిం)

## 8) బంధాన్ని బలపర్చమని ప్రోత్సహించడం

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "అల్లాహ్, ఆయన దూతలు, భూ ఆకాశ వాసులు, చివరికి రంధ్రంలోని చీమ, సముద్రంలోని చేప కూడా- ప్రజలకు మంచిని బోధించే గురువును ఆశీర్వదిస్తారు"

## 9) సంధి కుదర్చడం

సాధారణంగా ప్రజలు జరిపే రహస్య మంతనాలలో ఎలాంటి శ్రేయస్సు ఉండదు. అయితే దానధర్మాలను గురించి రహస్యంగా ఏదైనా హితోపదేశం చేస్తే లేదా మరేదైనా సత్కార్యం చేయడానికో లేక ప్రజల వ్యవహారాలు చక్కదిద్దడానికో ఎవరితో ఏదైనా అంటే అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అది మంచి విషయమే. ఎవరైనా దేవుని ప్రసన్నత కోసం ఇలా చేస్తే మేమతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. (అన్‌నిసా: 114)

వేరొకచోట అల్లాహ్ ఇలా అంటున్నాడు: "ఏది ఏమైనా (భార్యాభర్తల మధ్య) సర్దుబాటే అన్ని విధాలా ఉత్తమమైనది."

(అన్ నిసా : 128)

"మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి."

(అల్ అన్ఫాల్ : 1)

ఆయన ఇంకా ఇలా సెలవిస్తున్నాడు: "విశ్వాసులు పరస్పరం సోదరులు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలను సంస్కరించండి." (అల్ హుజురాత్ : 10)

ప్రజల మధ్య సంబంధాలను చక్కదిద్దే (ఉద్దేశ్యంతో వాస్తవానికి విరుద్ధంగా మాట్లాడేవాడు అబద్ధాలకోరు కాజాలడు. (ఒకరి నుండి మరొకరికి) మంచి మాటలే చేరవేస్తాడు. ఏది చెప్పినా మంచి ఉద్దేశ్యంతోనే చెబుతాడు అన్నారు ప్రవక్త(స). (బుఖారీ- ముస్లిం)

ఉమ్మె కుల్సూమ్ అంటున్నారు: దైవప్రవక్త(స) ప్రజలకు మూడు విషయాల్లో తప్ప మరే విషయంలోనూ వాస్తవానికి విరుద్ధంగా మాట్లాడేందుకు అనుమతి ఇచ్చినట్లు నేను వినలేదు. ఆ మూడు విషయాలు ఇవి: యుద్ధంలో, ప్రజల మధ్య సంబంధాలను చక్కదిద్దే సమయంలో, మనిషి తన భార్యతోగాని భార్య తన భర్తతోగాని (పరస్పరం సంతోషపెట్టే ఉద్దేశ్యంతో) సంభాషించుకున్నప్పుడు. (ముస్లిం)

## 10) అవిశ్వాస బంధువులతో ఉత్తమంగా మసలుకోవాలి

హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) కుమార్తె అస్మా (రజిఅన్‌హా) కథనం : దైవప్రవక్తకు, మక్కా బహు దైవారాధకులకు మధ్య జరిగిన హుదైబియా ఒప్పంద కాలంలో ఒకసారి మా అమ్మ నా దగ్గరికి వచ్చింది. అప్పటికి ఆమె ఇంకా బహుదైవారాధకురాలిగానే ఉంది. నేను ఆమె వచ్చిన సంగతి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావిస్తూ "దైవప్రవక్తా! మా అమ్మ నా దగ్గరికి వచ్చి ఉంది. ఆమె నా నుండి సద్వర్తనను ఆశిస్తోంది. మరి నేను (బహు దైవారాధకురాలైన) మా అమ్మ పట్ల మంచిగా మెలగవచ్చా?" అని అడిగాను. అందుకాయన "అవును, నువ్వు మీ అమ్మ పట్ల (తప్పకుండా) సత్ప్రవర్తనతో మెలగాలి" అని అన్నారు. (బుఖారీ - ముస్లిం)

బంధువులు బహుదైవారాధకులైనా, దైవతిరస్కారులైనా సరే వారితో సత్సంబంధాలు కొనసాగించటంలో మాత్రం ఎలాంటి లోటు రానీయకూడదు.. వారి హక్కుల్ని నిర్వర్తిస్తూ ఉండాలి. వారికున్న ప్రప్రథమ హక్కు ఏమిటంటే వారికి విశ్వాసాన్ని, సదాచరణను బోధించి పరలోకంలో వారిని నరకాగ్ని బారినుంచి కాపాడాలి.

దైవప్రవక్త(స) మెల్లిగా కాకుండా బిగ్గరగా, "ఫలానా తెగవారు

నా మిత్రులు కాజాలరు. అల్లాహ్ మరియు సదాచార సంపన్నులైన విశ్వాసులే నా మిత్రులు. అయితే ఆ తెగవారితో నాకు బంధుత్వ ముంది. కనుక నేను బంధుత్వ సత్సంబంధాలను మాత్రం తప్పకుండా కొనసాగిస్తాను'' అని ప్రకటిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ అబ్దుల్లాహ్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తెలియజేశారు. (బుఖారీ - ముస్లిం, వాక్యాలు మాత్రం బుఖారీలోనివి)

## బంధుత్వ బంధాన్ని బలపరిస్తే కలిగే లాభాలు

**1) స్వర్గ ప్రాప్తి - నరక విముక్తి**

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) వారిని స్వర్గంలో ప్రవేశింపజేసే, నరకం నుండి దూరంగా ఉంచే ఒక కార్యం గురించి తెలుపమని అడిగాడు: దానికి ఆయన- మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిం చండి, షిర్క్ చెయ్యకండి, నమాజు స్థాపించండి, జకాత్ చెల్లించండి, కుటుంబ బంధాలను బలపరచండి అని హితవు పలికారు. (ముస్లిం)

**2) విశ్వాసం వికసిస్తుంది**

అల్లాహ్ ఇలా అంటున్నాడు: ''విశ్వాసులు పరస్పరం సోదరులు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలను సంస్కరించండి.''

(అల్ హుజురాత్ : 10)

**3) అల్లాహ్ ఆగ్రహానికి దూరమవుతాము, అల్లాహ్ అనుగ్రహానికి దగ్గరవుతాము**

బంధుత్వ సంబంధాల ప్రాముఖ్యత గురించి నొక్కి వక్కాణిస్తూ దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ''అల్లాహ్ సమస్త సృష్టిరాసులను సృష్టించిన తర్వాత 'బంధుత్వం' లేచి నిలబడి- '(దేవా!) నేను బంధుత్వ సంబంధాల విచ్ఛిన్నం నుండి నీ శరణు వేడుకుంటు న్నాను' అని విన్నవించుకుంది. దానికి ''అయితే నిన్ను బలపర్చిన వాడిని నేనూ బలపరుస్తాను. నీతో తెగత్రెంపులు చేసుకున్నవాడితో నేనూ తెగత్రెంపులు చేసుకుంటాను, ఇది నీకు ఇష్టమే కదా!'' అని అడిగాడు అల్లాహ్. దానికి బంధుత్వం 'ఇష్టమే ప్రభూ!' అని అంది. అప్పుడు అల్లాహ్ ''సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది'' అని దీవించాడు. (ముత్తఫఖున్ అలైహి)

**4) ఉపాధిలో సమృద్ధి, ఆయుష్షులో పెరుగుదల**

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: ''తన ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షులో పెరుగుదలను కోరుకునే వ్యక్తి తన బంధువులతో సత్సంబంధాలు పెట్టుకోవాలి''. (బుఖారీ)

**5) ఉత్తమ స్థితిలో మరణం**

దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: ''తన ఉపాధిలో సమృద్ధిని, ఆయుష్షులో పెరుగుదలను, మంచి స్థితిలో మరణాన్ని కోరుకునే వ్యక్తి తన బంధువులతో సత్సంబంధాలు పెట్టుకోవాలి''. (మజ్మవుజ్ జవాయద్)

## బంధుత్వ సంబంధాలు బలంగా లేకపోవడానికి కారణాలు

1) బంధుత్వ సంబంధాల వల్ల కలిగే పుణ్యం, దానిని తెంచడం వల్ల కలిగే నష్టం గురించి తెలియకపోవడం.

2) ధర్మ అవగాహనా రాహిత్యం

3) అహంకారం

4) పూర్వీకుల అంధానుసరణ- అమ్మా నాన్న శత్రుత్వాన్ని సంతానం వారసత్వంగా కొనసాగించడం.

5) చాలాకాలం వరకు పలుకరించుకోకపోవడం.

6) తరచూ ఒండొకరిని కలిసి యోగక్షేమాలు తెలుసుకోకపోవడం.

7) తీవ్ర స్థాయిలో కువిమర్శలకు దిగడం, నిందలు వేయడం.

8) పిసినారితనం, పేరాశ

9) ఆదాయానికి మించి ఖర్చు చేయడం

10) వారసత్వపు ఆస్తి పంపకంలో జాప్యం వహించడం

11) ప్రాపంచిక వ్యామోహం

12) ఆత్మ స్తుతి, స్వీయ ప్రశంస

13) భరించే గుణం లేకపోవడం

14) సందర్శించుకునేంత దగ్గరలో లేకపోవడం

15) ముఖ్యమైన విందుల్లో, శుభ కార్యాల్లో ఆహ్వానించకపోవడం

16) అనవసరమైన సిగ్గు, మోతాదుకు మించిన మొహమాటం

17) వచ్చిన బంధువుల్ని సరిగా పట్టించుకోకపోవడం

## నేటి మన స్థితి

ఇంట్లో ఉన్న అత్తగారితో సజావుగా నడుచుకోలేని, సరిగ్గా మాట్లాడని కోడలు ఎక్కడో విదేశాల్లో ఉండే ఫ్రెండ్స్‌తో గంటల తరబడి ముచ్చట్లు చెప్పుకుంటుంది. సమాజ సేవలో ఎంతో మందిని చేరదీసే అత్తగారికి కోడలంటే చిన్న చూపు. చాలా మంది కొత్త పరిచయాల కోసం పడే ఆరాటం, చూపే ఆసక్తి, ఉత్సాహం ఉన్న సంబంధ బాంధవ్యాలు మెరుగుపర్చుకోవడానికి ప్రయత్నిం చడం లేదు. నిత్యం కలుసుకునే వ్యక్తులు, స్నేహితులు, రక్త సం బంధీకుల మధ్య ఉండే కమ్యూనికేషన్ గ్యాప్ ఇంటర్‌నెట్‌లో

**మిగతా 29వ పేజీలో...**

# ఆత్మావలోకనం చేసుకోవాలి

- నసీరా బేగం

**అల్లాహ్** ప్రతి మనిషిని ఎన్నో మంచి మంచి సుగుణాలతో సృష్టించాడు. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రత్యేక గుణం స్పష్టంగా కనబడుతూ ఉంటుంది. కాని కొన్ని ప్రత్యేక సుగుణాలు కేవలం అల్లాహ్‌ను విశ్వసించిన కారణంగా ఒక విశ్వాసిలో ప్రస్ఫుటమవుతాయి. విశ్వాసి అనగానే అతని ద్వారా ఏ పాపమూ జరగని అత్యంత పరిశుద్ధుడు ఎంతమాత్రమూ కాదు. మనిషి పుట్టుకతోనే అత్యంత బలహీనుడు. అసలు పరీక్ష ఏమిటంటే అతని స్వభావంలో ఉండే బలహీనతలపై అతను అదుపును సాధించవలసి ఉంటుంది. అది కేవలం ఒక రోజులో రెండు రోజులలో సాధించే కార్యం ఎంతమాత్రమూ కాదు. అతని స్వభావంలో కోపం ఉంటుంది. ప్రతీకార స్వభావం ఉంటుంది. కోరికలకు, మనోవాంఛలకు లొంగిపోయే స్వభావమూ ఉంటుంది. అసత్యం పలికే అలవాటు ఉంటుంది. ఎవరినైనా మోసం చేసే చెడ్డ గుణమూ ఉంటుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చెడ్డ గుణాలు మనిషిలో ఉంటాయి. వాటినన్నింటిపై ఒక విశ్వాసి అదుపును సాధించే పూర్తి ప్రయత్నం చేస్తాడు. అప్పుడప్పుడు అనుకోకుండా ఏదైనా బలహీనతకు గురైతే వెంటనే పశ్చాత్తాపపడతాడు. మాటిమాటికి ఆ బలహీనతలకు గురికాకుండా జాగ్రత్త పడతాడు. ఒక విశ్వాసిలోని ఈ సుగుణం మామూలు గుణం కాదు. ఇది ఎంత విలువైనది అంటే అది అతనికి ఇహలోకంలో గౌరవాన్ని ప్రసాది స్తుంది. అల్లాహ్ సామీప్యాన్ని ప్రసాదిస్తుంది. స్వర్గానికి అర్హులుగా చేస్తుంది. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి. మీరు కరుణింపబడే అవకాశం ఉంది. మీ ప్రభువు క్షమాభిక్ష వైపునకు, స్వర్గం వైపునకు పోయే మార్గంలో పరుగెత్తండి. ఆ స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమైంది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చెయ్యబడింది. వారు కలిమిలో, లేమిలో, ఏ స్థితిలో ఉన్నా తమ సంపదను ఖర్చు చేసేవారు, కోపాన్ని దిగమ్రింగేవారు, ఇతరుల తప్పులను క్షమించే వారు- ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం- వారి స్థితి ఎలా ఉంటుందంటే, ఎప్పుడైనా ఏదైనా అశ్లీల కార్యం వారి వల్ల జరిగిపోతే లేదా ఏవైనా పాపం చేసి, వారు తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నట్లయితే వెంటనే వారికి అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అప్పుడు వారు ఆయనను తమ తప్పులు క్షమించు అని వేడుకుంటారు. ఎందుకంటే అల్లాహ్ తప్ప తమ పాపాలను క్షమించగలిగే వాడెవడున్నాడని- వారు తాము చేసిన తప్పులను గురించి బుద్ధిపూర్వకంగా మొండివాదం చెయ్యరు. అలాంటి వారికి తమ ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం ఏమిటంటే, ఆయన వారిని క్షమిస్తాడు. కింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాల లోకి వారిని ప్రవేశింపజేస్తాడు. వారు అక్కడ శాశ్వతంగా ఉంటారు. మంచి పనులు చేసేవారికి ఎంత చక్కని ప్రతిఫలం! మీకు పూర్వం ఎన్నో యుగాలు గతించాయి. అల్లాహ్ ఉపదేశాలు అసత్యాలని తిరస్కరించే వారి ముగింపు ఎలా జరిగిందో స్వయంగా భూమిపై

**మిగతా 34వ పేజీలో...**

# చైనాలో ఇస్లాం వ్యాప్తి



ముహమ్మద్ షరీఫ్

**ఆఫ్రికా** తర్వాత, ముస్లింల సందేశ విజయాల రెండవ క్షేత్రం మధ్య ప్రాచ్యం. ఇక్కడ కూడా, కేవలం వ్యాపారులు, సైనికులు సాధారణ ముస్లింలు కేవలం వారి సహజ అభిరుచి, ఇస్లామీయ స్ఫూర్తితో ఇస్లాంను ప్రచారం చేశారు,

వారు ప్రభుత్వం, సంపదల మద్దతును ఎన్నటికీ పొందలేదు. అనేక సందర్భాల్లో శత్రువుల కత్తిని ఎదుర్కోవలసి వచ్చింది. ఐనప్పటికీ వారు తమ ధర్మాన్ని వ్యాప్తి చేయడంలో గొప్ప విజయాన్ని సాధించారు. ప్రస్తుతం చైనా, మలయాలలో వారి మొత్తం జనాభా 8,9 కోట్లకు తక్కువ కాదు.

చైనాలో ఇస్లాం మూలం బనూఉమయ్యా పాలన నాటిది. సన్మార్గ గాములైన ఖలీఫాల కాలంలో, అరబ్ వ్యాపారులు, నావికా టర్స్ అరేబియా సముద్రం నుండి పసిఫిక్ మహాసముద్రం వరకు అన్ని సముద్రాలను అన్వేషించారు.

చైనా ఒడ్డున ఇస్లాంను వ్యాప్తి చేసినప్పటికీ, ఇస్లాం పసుపు దేశం నుండి వ్యాపించలేదు. బనూ ఉమయ్యా రాజవంశం కాలంలో చైనీయులతో దౌత్య సంబంధాలు ఏర్పడినప్పుడు మాత్రమే వారికి ఇస్లాం పరిచయం జరిగింది. తరువాత, కింగ్ హ్సువాన్ టి సంగ్ ఒక దోపిడీదారుడిచే తొలగించబడినప్పుడు, అతని కుమారుడు ఖలీఫా మన్సూర్ అబ్బాసీ నుండి సహాయం కోరాడు మరియు అతనికి సహాయం చేయడానికి అతను నాలుగు వేల మంది సైనికులను పంపాడు, అతని బలంతో అతను సింహాస నాన్ని తిరిగి పొందాడు.

ఈ సైనికులు ఇస్లాం ధర్మ నిజమైన బోధకులు. స్వదేశానికి తిరిగి వెళ్లకుండా చైనాను తమ నివాసంగా మార్చుకున్నారు. ఇక్కడే వివాహం చేసుకున్నారు. కొన్ని శతాబ్దాలలోనే కేంటిన్ ప్రాంతం మొత్తం ఇస్లాం కాంతితో నిండిపోయింది.

❖❖❖

## ఇస్లాం ఎలా వ్యాపించింది?

ఇస్లాం వ్యాప్తి గమ్యం దిశగా.

ఈ సంఘటన జరిగిన ఆరు వందల సంవత్సరాల తరువాత, 7వ శతాబ్దం హిజ్రీలో మంగోలుల ప్రభంజనంలో కొట్టుకుపోయిన అరబ్, ఇరానియన్ టర్కిష్ శరణార్థుల ద్వారా మరోసారి ఇస్లాం బయటి నుండి చైనాలోకి ప్రవేశించి దేశమంతటా వ్యాపించింది.

ఈ ప్రజల కారణంగా, నూట యాభై సంవత్సరాలలో, ఇస్లాం చైనాలోని చాలా ప్రాంతాలలో వ్యాపించింది. ప్రత్యేకించి, ఉత్తర, పశ్చిమ చైనాలోని మొత్తం ప్రాంతాలు ముస్లింలుగా మారాయి.

క్రీ.శ. పదమూడవ శతాబ్దిలో, యునాన్ ప్రావిన్స్ ఎక్కువగా ముస్లింగా మారిందని మార్కో పోలో పేర్కొన్నాడు. మరో 14వ

శతాబ్దపు చరిత్రకారుడు తాలిఫోలోని మొత్తం జనాభా ముస్లింలు అని రాశారు.

దక్షిణ చైనాకు సంబంధించి, ఇబ్న్ బతూత వ్రాస్తూ, అన్ని నగరాల్లోని ముస్లింల మొత్తం పొరుగు ప్రాంతాలు ఉన్నాయని, వారి స్వచ్ఛత నాగరికతలకు చాలా ప్రత్యేకత ఉందని చెప్పాడు.

ముస్లింలు చైనీస్ స్త్రీలను వివాహం చేసుకుంటారు, సాధారణ చైనీయులతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటారు దీని కారణంగా, ఇస్లాం చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. పదిహేనవ శతాబ్దిలో అలీ అక్బర్ అనే ముస్లిం వ్యాపారి, పెకింగ్‌లో దాదాపు 30,000 ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నా యని రాశారు. పదిహేడవ శతాబ్ది ప్రారంభంలో, చైనీస్ యూదుల పెద్ద సమూహం ఇస్లాంలోకి మారింది. 18వ శతాబ్దిలో, కెన్ లింగ్ జంగారియా తిరుగుబాటును అణిచి వేసాడు. పదివేల కుటుంబాలను తీసుకొని అక్కడ స్థిరపడ్డాడు, చుట్టుపక్కల ఉన్న ఇస్లామీయ జనాభా ప్రభావంతో వారందరూ ముస్లింలుగా మారారు.

షాంటాంగ్‌లో కరువు సమయంలో, ముస్లింలు పది వేల మంది చైనీస్ పిల్లలకు ఆశ్రయం కల్పించారు. వారందరికీ ఇస్లాం భాగ్యం లభించింది. మరొక కరువు సందర్భంగా, క్వాంగ్ టుంగ్‌లో, ముస్లింలు ఇస్లామీయ విద్యతో పెరిగిన సుమారు పది వేల మంది చైనా పిల్లలు ఉన్నారు.

ఇటువంటి అసాధారణమైన సందర్భాలలో కాకుండా, ముస్లింలు సాధారణ పరిస్థితుల్లో కూడా ఇస్లాంను ప్రచారం చేస్తారు, ఒక చైనీ ముస్లిం సయ్యద్ సులైమాన్ ప్రకారం, ప్రతి సంవత్సరం ఇస్లాంలోకి మారిన వారి సంఖ్యను లెక్కించడం చాలా కష్టం.

ప్రస్తుత కాలం(అనగా 1925)లో కూడా చైనా ముస్లింలలో ఇస్లాం ధర్మ ప్రచారంపై ప్రత్యేక అభిరుచి ఉంది.

❖❖❖

వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో పాటు, ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు కూడా సాధారణంగా వారితో సంభాషించడానికి అవకాశం ఉన్న చోట ధర్మాన్ని బోధిస్తారు. చైనా సైన్యపు ముస్లిం అధికారులు, సైనికులు కూడా ఈ విధిని విస్మరించరు. గత కొంత కాలంగా, చైనీస్ ముస్లింలు తమ స్థానాన్ని గ్రహించారు. ఇస్లాం వ్యాప్తి ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకున్నారు. అయితే, కాన్సులో ఒక మదర్సా స్థాపించబడింది ఇప్పుడు దాదాపు పది ప్రావిన్సులలో ఇలాంటి మదర్సాలు స్థాపించబడ్డాయి.

చైనా వెలుపలి నుండి వచ్చిన ముస్లింల సంఖ్యను మనం లెక్కించినట్లయితే, బహుశా వారి సంఖ్య లక్షకు మించకపోవచ్చు, కానీ ఈ సార్వత్రిక సందేశ అభిరుచి మాత్రమే వారి సంఖ్యను ఐదు మిలియన్లకు చేర్చింది.

ఒక రష్యన్ విశ్లేషకుడు; ఇస్లాం వ్యాప్తి ఇదే వేగంతో కొనసాగితే, ముస్లిం రాజకీయాలు ఒక్కసారిగా మధ్యప్రాచ్య మ్యాప్‌ను పూర్తిగా మార్చివేస్తాయనడంలో సందేహం లేదు అని అంటాడు.

కమ్యూనిజం ప్రభంజనం తర్వాత చైనాలోని ముస్లింల బాధలు ఆనాటి పరిస్థితిని, ప్రస్తుత కాలాన్ని పోల్చి చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. కమ్యూనిస్టు విప్లవం సమయంలో, అక్కడ ముస్లింల సంఖ్య 5 కోట్లకు పైగా ఉండేది. కానీ 1921 అధికారిక జనాభా లెక్కల ప్రకారం, ఈ సంఖ్య కేవలం 1 మిలియన్ తగ్గింది.

26వ పేజీ తరువాయి...

## రక్తానుబంధం ...

కలిసిన వ్యక్తుల మధ్య ఉండటం లేదు. ఆ వ్యక్తులు కేవలం మాటలు, రాతల ద్వారానే పరిచయం. వాళ్ళు ప్రత్యక్షంగా కూడా కలిసింది ఉండదు. అయినా వారి మధ్య ఎంతో నమ్మకం, ఆత్మీయత, ప్రతి బంధం ఇలానే ఉండాలని లేదు. ప్రేమ, నమ్మ కం, మోసం అనేవి వాస్తవ ప్రపంచం, మిథ్యా ప్రపంచం రెండింటిలో సమానంగా ఉన్నాయి.

అంటే ఇతరులతో మంచి సంబంధాలు కలిగి ఉండకూడదని కాదు, ప్రాధాన్యత ముందు తన వారికివ్వాలన్నదే. మనం ఇచ్చే ఆ ప్రాధాన్యత దైవాభీష్టం ప్రకారం ఉండాలన్నదే. విశ్వ శక్తి చైతన్యమూర్తి, ఏడేడు లోకాలకే ఇలవేల్పు అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

''మీరంతా అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టకండి. తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథలూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులైన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాట సారులు, మీ ఆధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదార బుద్ధితో వ్యవహరించండి.'' (అన్ నిసా : 36)

# మీ త్యాగాలకు సలామ్

## (అక్టోబర్ 21, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం)





- యండి.ఉస్మాన్ ఖాన్

**సమాజం**లోని గౌరవప్రదమైన వృత్తుల్లో పోలీసు ఉద్యోగం కూడా ఒకటి. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, ఘోరాలు, విధ్వంసాలూ జరగకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇది. వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పోలీసుల పాత్ర చాలా కీలకం. పోలీసులను, పోలీసు వ్యవస్థను ప్రజలు ఎంతగానో గౌరవిస్తారు. ఎందుకంటే, శాంతి భద్రతల పరిరక్షణలో వారు పోషిస్తున్న పాత్ర అనుపమానం. ప్రపంచమంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు పోలీసులు మేల్కొని, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా శ్రమిస్తారు. కుటుంబంతో కలిసి జరుపుకునే పండగలు, పబ్బాల్లాంటి సంతోష కార్యాలను కూడా త్యజించి, ప్రజల కోసం జీవించి, ప్రజల కోసమే మరణించే పోలీసులకు, ప్రాణాలను పణంగా పెట్టి వారు చేస్తున్న త్యాగాన్ని గౌరవించడం, వారిపట్ల సదభిప్రాయం కలిగి ఉండడం మనందరి బాధ్యత. సరే.. మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు అన్నిచోట్లా ఉంటారు.. పోలీసులూ దీనికి మినహాయింపు కాదు. అది వేరే విషయం. ఖాకీ డ్రస్సు వేసుకోగానే కళ్ళు నెత్తికెక్కి, ప్రజలను చులకనగా చూసే వాళ్ళు కొందరుంటారు. కేవలం కొందరివల్ల మొత్తం వ్యవస్థను తప్పు పట్టలేం. పోలీసుల్లో అత్యుత్తమ మానవ విలువలు పాటించేవాళ్ళూ ఉన్నారు. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే, ఈరోజు (అక్టోబర్ 21) పోలీసు అమర వీరుల సంస్మరణ దినం కాబట్టి. 1959లో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిన రోజు కాబట్టి, ఈ రోజును ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపు కుంటారు. భారత్ - చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్స్ అనే ప్రదేశంలో 1959 అక్టోబర్ 21న చైనా సైనికులు దాడి చేసిన సంఘటనలో 10 మంది సిఆర్‌పిఎఫ్ జవానులు నేలకొరిగారు. అప్పటి నుంచి వారిని స్మరించుకుంటూ ప్రతి యేటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీసు శాఖ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన వారికి ఘనంగా నివాళులు అర్పించి, వారి ఆశయ సాధన కోసం పని చేస్తామని ప్రతిన బూనడానికి పోలీసు అమరవీరుల దినోత్సవం వేదికగా నిలుస్తోంది. ఖాకీ యూనిఫాంలో ప్రజలకు సహజ స్నేహితులుగా కనిపించే పోలీసులను చూస్తే ఆపదలో ఉన్నవారికి కొండంత ధైర్యం. పోలీసులు కూడా కట్టుకున్న వారిని, కన్నబిడ్డలను విడిచి విధి నిర్వహణే పరమావధిగా ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. చైనా యుద్ధం నుంచి నేటి అంతర్గత భద్రత కోసం సాయుధ సంఘర్షణలో ప్రతి నిత్యం

చావుబ్రతుకుల మధ్య పోరాటం సాగిస్తూనే వున్నారు. ధర్మ సంరక్షణార్థం తమ విలువైన ప్రాణాలను తృణపాయంగా అర్పిస్తూనే ఉన్నారు. వారు వేసుకునే ఖాకి దుస్తుల వెనుక కారుణ్యం, కన్నీరు దాగి ఉన్నా వృత్తి ధర్మానికి తలొగ్గి ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రజా రక్షణలో  అమరులైన పోలీసులెందరో.. అసాంఘిక శక్తులను అణిచే క్రమంలో నిరంతరం కృషి చేస్తూ విధి నిర్వహణలో సమిధలైనవారు ఎందరో..


విధి నిర్వహణ అనేది బాధ్యతతో కూడుకున్నది. అందునా పోలీసుల విధి నిర్వహణ మరింత బాధ్యతతో, మరింత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగులకు లాగా కొన్ని గంటలకు పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఏదన్నా ఉన్నదంటే అది పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. ఏ అవసరం, ఏ ఆపద వచ్చినా ముందు గుర్తుకొచ్చేది పోలీసులే, ఆశ్రయించేది వారినే. ఏ వేళయినా, ఎలాంటి పరిస్థితులయినా అన్ని వేళల్లో ముందుండేది వాళ్ళే. సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతి భద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసుల కర్తవ్యం. అంతర్గత  భద్రతను కాపాడే క్రమంలో ప్రాణాలర్పించిన పోలీసులు అనేకమంది.

## సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంలో వారికి వారే సాటి

కోవిడ్ 19 సమయంలో ముందువరుసలో నిలబడి వారు నిర్వహించిన పాత్ర సదా స్మరణీయమే. కాకపోతే అప్పుడప్పుడూ అవసరాన్ని బట్టి కాస్త కరుకుదనం ప్రదర్శిస్తూ ఉంటారు. ఖాకీడ్రస్ కరుకుదనం వెనుక ఉన్నది కూడా మనిషే కాబట్టి మర్యాద, గౌరవం,  విలువ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నిజానికి, నిద్రాహారాలు మాని విధులు నిర్వహించే  పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్నచూపే. సమయపాలన లేని విధులు, పైఅధికారులతో తిట్లు, జనంతో ఛీత్కారాలు... ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నా ఎవరూ గుర్తించడం లేదని చాలామంది పోలీసులు వాపోతున్నారు. పోలీసులకు విశ్రాంతి కావాలనే విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే పోలీసుల విధులు విభిన్నం. వీరికి పని గంటలతో సంబంధం ఉండదు. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రతిక్షణం ఆలోచించాల్సిందే. దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడి (Stress) కారణంగా రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం మంది తలనొప్పి, బీపీ, మధుమేహం, మెడ, వెన్నునొప్పి ఇలా ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. హోంగార్డు, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల పరిస్థితి మరీ దారుణం. డ్యూటీకి వచ్చింది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేంత వరకు విరామం లేకుండా పని చేయాల్సిందే. బందోబస్తుల్లో పాల్గొనేవారి పరిస్థితి సరేసరి. ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండి శాంతి భద్రతలను కంటికి రెప్పలా కాపాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలకు తగిన సహాయం అందించటలో ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ అమర వీరుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తూ, సంస్మరణ దినం రోజు మాత్రమే గుర్తుకు వస్తున్నామని మళ్లీ ఏడాది వరకు తమ కుటుంబాలను పట్టించుకునే వారే ఉండరని వాపోతున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు కుటుంబాలను ప్రభుత్వం ఇప్పటికైనా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. తీవ్రవాద, ఉగ్రవాద దాడులతో పాటు అసాంఘిక శక్తుల దాడిలో విధి నిర్వహణలో వీరమరణం పొందిన వారి కుటుంబాలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. అప్పుడే భవిష్యత్తులో పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు వచ్చేవారికి ఒక భరోసా లభిస్తుంది. విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపినట్లవుతుంది. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం అసలు ఉద్దేశం ఇదే. ఏది ఏమైనా వృత్తిధర్మానికి తలవంపులు తేకుండా, సమాజంలో శాంతి భద్రతల బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న పోలీసు అన్నలందరికీ సెల్యూట్ చేద్దాం. ఏమంటారు?

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

# ఈ వారం ఫేక్ న్యూస్ రౌండప్




ఈ వారం ఫేక్ వార్తలను గమనిస్తే విచిత్రమైన వార్త ఒకటి వచ్చింది. సైన్యానికి చెందిన ఒక సైనికుడు చేసిన పని వల్ల అవాంఛనీయ మత ఉద్రిక్తత చోటు చేసుకుంది. భారత సైన్యానికి చెందిన సోల్జర్ షైన్ కుమార్ తనపై దాడి జరిగిందని చెప్పుకున్నాడు. కేరళలోని కొల్లాం జిల్లాలోని కొడక్కల్ పట్టణంలో ఈ దాడి జరిగినట్లు చెప్పాడు. చివరకు తెలిసిందేమిటంటే, ఈ దాడి అతను తనపై తానే చేసుకుని కట్టుకథ అల్లాడు. ఈ సంఘటన సెప్టెంబర్ 25న జరిగింది. టైమ్స్ నౌ, ఇండియా టుడే, జీ న్యూస్ వంటి వార్తాసంస్థలు ఈ సంఘటనకు వెంటనే చిలవలు పలవలు చేసి ప్రచారం చేశాయి. తనపై దాడి చేసిన వాళ్ళు తన చేతులు కట్టేసి, పిఎఫ్ఐ అంటే పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అని తన వీపుపై రాశారన్నాడు. పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అనేది భారత ప్రభుత్వం నిషేధించిన ముస్లిముల రాడికల్ సంస్థ. ఈ సంఘటనపై కడక్కల్ పోలీసులు విచారణ జరిపారు. చివరకు ఇదంతా ఒక నాటకమని తెలిసింది. షైన్ కుమార్ మిత్రుడు జోషీ ఈ నాటకం గురించి పోలీసులకు చెప్పాడు. తానే షైన్ కుమార్ వీపుపై పిఎఫ్ఐ అని రాసినట్లు ఒప్పుకున్నాడు. షైన్ కుమార్ రాయమని కోరితేనే తాను రాసినట్లు చెప్పాడు. కొల్లాం రూరల్ జిల్లా ఎస్పీ ఆర్ ప్రతాపన్ నాయర్ ఈ వివరాలు తెలియజేశారు. షైన్ కుమార్ ఎలాగైనా జాతీయ స్థాయిలో వార్తల్లోకి రావాలనుకున్నాడు. ఆ విధంగా ఆర్మీలో తనకు మంచి పోస్టింగు దొరుకుతుందని అనుకున్నాడు. షైన్ కుమార్, జోషీ ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన తర్వాత ఈ ప్రాంతంలో మతపరమైన ఉద్రిక్త పరిస్థితి కూడా తలెత్తింది. బీజేపీ జాతీయ ప్రతినిధి అనిల్ కే అంటోనీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే.సురేంద్రన్‌లు ఈ సంఘటన గురించి అందరి కన్నా ముందు ఖండనలు జారీ చేశారు. ఈ ఇద్దరి వ్యాఖ్యలు మతపరమైన ఉద్రిక్తతను పెంచాయి. ఈ సంఘటనను బట్టి పేరు కోసం కొందరు ఏ స్థాయికి దిగజారుతారో తెలుస్తోంది. అంతేకాదు, ఇలాంటి వారి చర్యల వల్ల సమాజంలో ఎలాంటి వాతావరణం ఏర్పడుతుందో కూడా అర్థమవుతోంది. ఇలాంటి సంఘటనలు ముందుకు వచ్చినప్పుడు పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు ఆగకుండా, తొందరపాటు వ్యాఖ్యలు చేయడం వల్ల సమాజానికి ఎంత నష్టమో కూడా అర్థమవుతోంది.

ఇలాంటి నాటకం మరొకటి ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వార్తల్లో ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 2వ తేదీన ఈ సంఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్పూర్‌లో ఒక వ్యక్తి ఒక మహిళ మొబైల్ ఫోను లాక్కోడానికి ప్రయత్నించాడు. అతన్ని అరెస్టు చేశారు. అతను ముస్లిముల మాదిరిగా టోపీ ధరించి ఉన్నాడు. కాబట్టి ముస్లిము అనుకున్నారు. కాని అతని పేరు ప్రమోద్ సేర్. వృత్తిపరంగా కంసాలి. మహిళ మొబైల్ ఫోను లాక్కోడానికి ప్రయత్నిస్తున్న దృశ్యం సిసిటీవీలో రికార్డయ్యింది. అతను ముస్లిం మాదిరిగా టోపీ ధరించి ఈ దొంగతనానికి ప్రయత్నించాడు. ఈ వీడియో రాగానే పోలీసులు విచారణ జరిపి అతడిని అరెస్టు చేశారు. పోలీసులను తప్పుదారి పట్టించడానికి తలపై ముస్లిముల టోపీ పెట్టుకున్నానని చెప్పాడు. వీడు చేసింది కేవలం దొంగతనం మాత్రమే కాదు, ముస్లిం మాదిరిగా నటిస్తూ మతపరమైన ఉద్రిక్తతలు పెంచే పని కూడా చేశాడు.

మరో ఫేక్ వార్త చూద్దాం. బీజేపీ నేతలు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా, హోంమంత్రి అమిత్ షా తదితరులు ప్రధాని నరేంద్రమోడీని దేశానికి మొదటి ఓబీసీ ప్రధానిగా చెబుతూ ఉంటారు. సెప్టెంబర్ 21వ తేదీన నడ్డా ఈ మాటలు రాజ్యసభలో కూడా చెప్పారు. ఈ మాటలపై ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరాలు కూడా చెప్పారు. భారతదేశానికి ప్రధానమంత్రిగా జూన్ 1996 నుంచి ఏప్రిల్ 1997 వరకు పనిచేసిన దేవెగౌడ్

మొదటి ఓబీసీ ప్రధాన మంత్రిగా తెలియజేశారు. దేవెగౌడ్ కర్నాటకలోని వొక్కలిగా సముదాయానికి చెందినవారు. వొక్కలిగ సముదాయాన్ని కర్నాటక ప్రభుత్వం మాత్రమే కాదు కేంద్ర ప్రభుత్వం కూడా ఓబీసీగా పరిగణిస్తుంది. అంతేకాదు, వీపీ సింగ్ తరువాత భారత ప్రధానిగా వచ్చిన చంద్రశేఖర్ జాట్ సముదాయానికి చెందిన వారు. రాజస్థాన్‌లో 1999 నుంచి జాట్ సముదాయం ఓబిసీగా పరిగణన పొందుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఓబిసీగా పరిగణిస్తుంది. అయినా బీజేపీ నేతలు మాత్రం నరేంద్రమోడీ దేశానికి మొదటి ఓబీసీ ప్రధాని అని ప్రచారం చేస్తున్నారు.

ఫేక్ వార్తలు విదేశాల నుంచి కూడా వస్తున్నాయి. ఇస్రాయిల్‌పై హమస్ భయంకరమైన దాడి చేసింది. అయితే గాజా టవర్ కూలిపోయిన పాత వీడియోను ఇప్పుడు తీసుకొచ్చి ఈ దాడుల్లో జరిగినట్లు ప్రచారం మొదలు పెట్టారు. అక్టోబర్ 7వ తేదీన ఈ వీడియో వైరల్ అయ్యింది. గాజాలో ఒక బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిందని ప్రచారం చేశారు. ఇస్రాయిల్ చేసిన ఎదురుదాడుల్లో ఈ భవనం కూలిపోయినట్లు చెప్పారు. పాలస్తీనీయులు తమ చావు తామే కొనితెచ్చుకున్నారని, ఇస్రాయిల్ భయంకరంగా శిక్షిస్తుందని వ్యాఖ్యలు రాశారు. అయితే బూమ్ వార్తాసంస్థ నిజనిర్ధారణలో తెలిసిందేమిటంటే, ఈ వీడియో 2021 నాటిది. గాజాలోని అల్ షూరూక్ టవర్ ఇస్రాయిల్ వైమానిక దాడిలో కూలిపోయిన వీడియో అది. ఇప్పుడు హమస్ చేసిన దాడులకు ప్రతిదాడిగా ఇస్రాయిల్ చేసిన దాడిలో కూలింది కాదు. ఈ వీడియోను అల్ జజీరా ప్రసారం చేసిందప్పుడు. అప్పట్లో 11 రోజుల పాటు హమస్, ఇస్రాయిల్ మధ్య యుద్ధం జరిగింది. పాత వీడియోను ఇప్పుడు పోస్టు చేయడం వల్ల ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.

మరో వార్త చూద్దాం. వ్యంగ్య కథనాన్ని వక్రీకరించి ప్రచారం చేసిన వార్త ఇది. న్యూస్ క్లిక్ సిబ్బందిపై పోలీసు దాడిని చైనా ఖండించినట్లు ఈ వార్త వచ్చింది. న్యూస్ క్లిక్ పై పోలీసు దాడిని చైనా ఖండించిందన్నట్లు ఒక వ్యంగ్య కథనాన్ని చాలా మంది నిజమని నమ్మేశారు. నిజానికి ఈ వ్యంగ్య కథనం వ్యంగ్య కథనాలకు పెట్టింది పేరయిన "ది ఫాక్స్" వెబ్ సైటులో వచ్చింది. తర్వాత ఇది సోషల్ మీడియాలో నిజమైన వార్తగా ప్రచారం అయ్యింది. న్యూస్ చెకర్ సంస్థ ఈ వార్త అబద్ధమని విచారించి చెప్పవలసి వచ్చింది. వ్యంగ్య కథనం ఏమిటంటే, చైనా విదేశీ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునింగ్ న్యూస్ క్లిక్ పై దాడులను ఖండించాడని రాశారు. ఇది నిజమైన వార్తగా ప్రచారంలోకి వచ్చేసింది. వ్యంగ్య కథనాలు రాసేవారు జాగ్రత్తలు తీసుకోకపోతే ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయో దీనివల్ల తెలుస్తోంది.

## మతసామరస్యానికి ఇండోనేషియా చిరునామ - బాలీలో హిందూ దేవాలయంపై దాడి చేసిన దోషులపై తక్షణం చర్యలు

ఇండోనేషియా మరోసారి అన్ని మతాలను గౌరవించే విధానాన్ని చాటి చెప్పింది. అన్ని మతాల ఆరాధనా ప్రదేశాల పవిత్రతను కాపాడే బాధ్యతకు కట్టుబడి పనిచేసే ప్రభుత్వంగా నిలబడింది. ఒక హిందూ దేవాలయం వద్ద నగ్నంగా ధ్యానం చేస్తున్న ఒక విదేశీ టూరిస్టు వీడియో వచ్చింది. ఈ వీడియో వైరల్ అయ్యింది. ఇన్ స్టాగ్రాంపై బాలీకి చెందిన నిలూహ్ జెలాంతిక్ దీన్ని షేర్ చేశాడు. బాలీ ప్రజలను, వారి విశ్వాసాలను అవమానపరిచే చర్యగా, అపవిత్రమైన చర్యగా దీన్ని రాశాడు. ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి చెందిన టెడీ రియాండీ వెంటనే దీనిపై విచారణకు ఆదేశించారు. ఆ విదేశీ టూరిస్టు సోషల్ మీడియా ఖాతాను కనిపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి అపవిత్రమైన చేష్టలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకున్న చరిత్ర ఇండోనేషియాకు ఉంది. ఏప్రిల్ 2023లో రష్యాకు చెందిన ఒక ఇన్ స్టాగ్రాం ఇన్ ఫ్లూయన్సర్ను దేశం నుంచి ఇండోనేషియా బహిష్కరించింది. ఆమె బాలీ హిందూ సంస్కృతిలో పవిత్రంగా భావించే ఒక చెట్టు ముందు నగ్నంగా నిలబడి ఫోటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అదేవిధంగా, జూన్ నెలలో డెన్మార్క్‌కు చెందిన మహిళ మోటారు సైకిలుపై అశ్లీలంగా వ్యవహరించినందుకు డిపోర్టు అయ్యింది. మతపరమైన, సంస్కృతిపరమైన పవిత్ర ప్రదేశాల్లో అశ్లీల వైఖరిని ఏ మతానికి చెందిన ప్రదేశాల్లో అయినా ఇలాంటి చేష్టలను ఇండోనేషియా ప్రభుత్వం సహించదన్న స్పష్టమైన సంకేతాలు ఇంతకు ముందు చాలా సార్లు ఇండోనేషియా స్పష్టంగా పంపింది. బాలీ ద్వీపం ప్రకృతి సౌందర్యం నిండిన ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడికి వస్తారు. అయితే పర్యాటకులు స్థానిక సంస్కృతిని, మతవిశ్వాసాలను గౌరవించాలని ఇండోనేషియా ప్రభుత్వం ఖచ్చితమైన నిర్దేశాలతో కూడిన మార్గదర్శక సూత్రాలను అందిస్తోంది.

## 27వ పేజీ తరువాయి...

# ఆత్మావలోకనం చేసుకోవాలి

సంచారం చేసి చూడండి. ఇది ప్రజలకు ఒక స్పష్టమైన హెచ్చరిక. అల్లాహ్‌కు భయపడేవారికి మార్గదర్శకత్వం, హితోపదేశం. (3: 133-138)

ఒక నిజ విశ్వాసికి ఏదైనా దురాలోచన కూడా ఒకవేళ వచ్చినట్లయితే అతని విశ్వాసం కారణంగా ఏదో పాపపు కార్యం చెయ్యబోతున్న భావన కలుగుతుంది. వెంటనే అల్లాహ్ జ్ఞాపకం వస్తాడు. అతని నుదుటి నుంచి సిగ్గూ, బిడియాల చెమట బిందువులు రాలుతాయి. అతను చేసే పాపపు కార్యం నుంచి అతను దూరంగా తొలగిపోతాడు. క్షమాభిక్ష పెట్టమని అల్లాహ్‌ను అర్థిస్తాడు. ఈ విషయాన్ని దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రస్తావించటం జరిగింది,వాస్తవానికి భయభక్తులు కలవారి స్థితి ఇలా ఉంటుంది; ఎప్పుడైనా షైతాన్ ప్రభావం వల్ల వారికి ఏదైనా చెడు ఆలోచన తట్టినప్పటికీ వారు తక్షణం అప్రమత్తులవుతారు. తరువాత వారు అవలంబించవలసిన సరైన మార్గమేమిటో వారికి స్పష్టంగా కనిపిస్తుంది. (7: 201)

ఒకవేళ అతని బలహీనత కారణంగా ఏదైనా పాపపు కార్యం జరిగిపోయినట్లయితే వెంటనే క్షమాభిక్ష కోసం మాటిమాటికి అల్లాహ్‌ను వేడుకుంటాడు. అల్లాహ్‌కు కూడా అతని ఈ వేడుకోలు ఎంతో చక్కనిదిగా అనిపిస్తుంది. కనుకనే ఈ విషయాన్ని దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేశాడు : ఓ ప్రవక్తా! ఇలా అను; మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలను క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. (39: 53)

ఒక విశ్వాసి అల్లాహ్ క్షమిస్తాడనే ధీమాతో తప్పులు, పొరపాట్లు చెయ్యడు. అతను అత్యంత జాగరూకతతో, జాగ్రత్తతో జీవితం గడుపుతూ ఉన్నప్పటికీ అనుకోకుండా భావోద్వేగాలకు గురి అయిన కారణంగా చేసిన తప్పుల పట్ల కూడా అతను ఆందోళన చెందుతాడు. కనుక క్షమాభిక్ష లభిస్తుందో లేదో అనే ఆత్రుతకు గురవుతాడు. అలాంటి వారి కోసం అల్లాహ్ ఇందులో ఓదార్పునిస్తున్నాడు.


అయితే ఈ వాక్యాల ద్వారా ఒక విశ్వాసి తనను తాను విశ్లేషించుకోవాలి. తనలో ఉన్న భయభక్తులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలి. తన ద్వారా జరుగుతున్న పొరపాట్లను, పాపాలను గుర్తించి సంస్కరించుకుంటూ ఉండాలి. ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలను దైవప్రవక్త(స) గారి జీవిత చరిత్రను ఎల్లప్పుడూ చదువుతూ ఉండాలి. దాని ద్వారా అతనికి మార్గదర్శకత్వం లభిస్తుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా తెలియజేశారు : ఒకరోజు హజ్రత్ అయ్‌నియ బిన్ హసన్(ర) హజ్రత్ ఉమర్ ఫారూఖ్(ర) గారి వద్దకు వచ్చి, ఓ ఖత్తాబ్ కుమారుడా! మీరు మాకు అధిక ధనమూ ఇవ్వటంలేదు. మా పట్ల న్యాయంగా కూడా వ్యవహరించటంలేదు అని గట్టిగా, కఠినంగా ఆరోపించారు. అది విన్న హజ్రత్ ఉమర్(ర) గారికి చాలా కోపం వచ్చింది. ఆయన కోపాన్ని గ్రహించిన హసన్(ర) గారి సోదరుని కుమారుడు వినయంగా ఇలా అన్నారు : ఓ అమీరుల్ మోమినీన్! అల్లాహ్ తనప్రవక్తను ఉద్దేశించి ఇలా సెలవిచ్చాడు; ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు. ఒకవేళ ఎప్పుడైనా షైతాన్ నిన్ను ఉసిగొలిపితే అల్లాహ్ శరణు వేడుకో. ఆయన అన్నీ వినేవాడు, అన్నీ తెలిసినవాడు. (7: 199)

హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : హజ్రత్ ఉమర్(ర) ఈ ఖుర్‌ఆన్ వాక్యాన్ని వినగానే శాంతించారు. రవ్వంత కూడా అయ్‌నియ (ర) పట్ల కఠినంగా వ్యవహరించలేదు. నిశ్చయంగా హజ్రత్ ఉమర్(ర) అల్లాహ్ గ్రంథం ముందు తల వంచేవారు. (బుఖారీ)

అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో విశ్వాసుల సుగుణాలను వేటినైతే ప్రస్తావించాడో అందులోని సుగుణం కోపంపై అదుపును సాధించటం. ఈ సంఘటన ద్వారా ఆయన(ర) గారి సత్ప్రవర్తన స్పష్టంగా తెలుస్తోంది.

**తుదిగీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**